# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 2 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు సోమవారం 7 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :2 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE MON 7 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# ఓటర్లకు డబ్బు పంచకుండా
# నా సవాల్ స్వీకరిస్తావా?

## పెద్దారెడ్డికి జేసీ ప్రభాకర్ రెడ్డి సవాల్

- తాడిపత్రిలో మరోసారి వేడెక్కిన రాజకీయం
- వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పెద్దారెడ్డికి జేసీ సవాల్
- చెరో రూ. 10 కోట్లు తాడిపత్రి అభివృద్ధికి ఖర్చు చేద్దామని ప్రతిపాదన



**పెన్ పవర్ డెస్క్:**అనంతపురం జిల్లా తాడిపత్రి రాజకీయాల్లో మరోసారి తీవ్ర ఉత్కంఠ నెలకొంది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి లక్ష్యంగా టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేస్తూ సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికలకు ఇప్పటినుంచే సిద్ధం కావాలని హెచ్చరించిన ఆయన... గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తాడిపత్రిలో మట్కా, బెట్టింగ్, గంజాయి దందాలు విచ్చలవిడిగా సాగాయని ఆరోపించారు. బీఎస్-3 వాహనాల కుంభకోణంతో పాటు అక్రమ సంపాదనకు అలవాటు పడి తాడిపత్రి ప్రాంత అభివృద్ధిని కేతిరెడ్డి పూర్తిగా నాశనం చేశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఈ విమర్శలతో పాటు జేసీ ప్రభాకర్ రెడ్డి ఓ ఆసక్తికరమైన సవాల్‌ను కేతిరెడ్డి ముందుంచారు. రాబోయే ఎన్నికల్లో ఓటర్లకు పైసలు పంచే సంస్కృతికి స్వస్తి పలికి, ఇద్దరం చెరో రూ. 10 కోట్ల చొప్పున మొత్తం రూ. 20 కోట్లు తీసి తాడిపత్రి పట్టణాభివృద్ధికి ఖర్చు చేద్దామని ప్రతిపాదించారు. "నా సవాల్‌ను స్వీకరించే ధైర్యం, తాడిపత్రిపై నిజమైన ప్రేమ నీకు ఉందా పెద్దారెడ్డి?" అని సూటిగా ప్రశ్నించారు



## రాజమండ్రిలో కుండపోత..
# రోడ్లన్నీ జలమయం

- రాజమండ్రిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం
- ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వాన
- లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయం
- డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
- వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు

**పెన్ పవర్ డెస్క్:**రాజమండ్రిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలు లు, ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వాన నగర ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. సుమారు గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి నగరంలోని ప్రధాన రహదారు లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదివారం సాయంత్రం వేళ ఒక్కసారిగా వాతావరణం మారిపోయి భారీ వర్షం ముంచెత్తింది. పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా పనిచేయకపోవడంతో వర్షపు నీరు రోడ్లపైనే భారీగా నిలిచిపోయింది. దీంతో రోడ్లు చెరువులను తలపించాయి. ఫలితంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముఖ్యంగా దానవాయిపేట, ఆవారోడ్డు, ప్రకాశ్ నగర్ సహా పలు ప్రధాన కూడళ్లలో

- మిగతా 2లో

# నేటి నుంచే నూతన పింఛన్ల దరఖాస్తులు



**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్‌లో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సామాజిక భద్రత కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం మరొక కీలక ముందడుగు వేసింది. సంక్షేమ రంగంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతూ 'ఎన్టీఆర్ భరోసా' పింఛను పథకం కింద నూతన దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది.

**రూ. 4,000 పింఛన్.. కొత్త అర్హులకు గొప్ప అవకాశం**

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 62 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా కింద పెంచిన పింఛన్లను

- మిగతా 2లో

## వెలిగొండ ఫీడర్ కెనాల్‌లో యువకుల
# గల్లంతుపై మంత్రుల ఆరా



**పెన్ పవర్ డెస్క్:**మార్కాపురం జిల్లా వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్‌లో ఇద్దరు యువకుల గల్లంతుపై మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడారు. కటకాని పల్లెకు చెందిన ఇద్దరు యువకులు గల్లంతుపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు విస్తృతం చేయాలని ఆదేశించారు. ఫీడర్ కెనాల్‌లో నీరు వేగంగా వస్తుంది కాబట్టి, ఎవరూ కూడా నీళ్లలో దిగవద్దని తెలిపారు. నల్లమల సాగర్‌లో ఎగుడు దిగుడులు ఉండడంతో, ఎక్కడ ఎంత లోతు ఉంటుందో

- మిగతా 2లో



## ఇండోనేషియాలో అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలు..
### విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం

- జకార్తాను కమ్మేసిన బూడిద మేఘాలు
- 300కు పైగా విమాన సర్వీసులు రద్దు
- వేలాది అడుగుల ఎత్తుకు ఎగిసిపడుతున్న బూడిద, ధూళి
- సునామీ ప్రమాదం లేదని స్పష్టం చేసిన ఇండోనేషియా అధికారులు
- బూడిద కారణంగా పలుచోట్ల పాఠశాలలకు సెలవులు, జనజీవనంపై ప్రభావం

- మిగతా 2లో

## హైదరాబాద్‌లో ట్రాన్స్‌జెండర్ల
# ఆగడాలపై డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్

- ట్రాన్స్‌జెండర్ల బలవంతపు వసూళ్లపై స్పెషల్ డ్రైవ్‌కు డీజీపీ ఆదేశం
- గతంలోనూ ఇలాంటి దందాలను అరికట్టామని వెల్లడి
- చింతల్‌లో గృహప్రవేశం వద్ద రూ. 50 వేలు డిమాండ్ చేసిన ఘటన వైరల్
- ప్రభుత్వ ప్రోత్సాహంతో పలువురు ట్రాన్స్‌జెండర్లు మంచి పేరు తెచ్చుకున్నారని ప్రశంస
- అన్ని కమిషనరేట్ల పరిధిలో తనిఖీలు చేపట్టాలని పోలీసులకు సూచన

- మిగతా 2లో



## మధ్యప్రదేశ్‌లో కల్తీ మద్యం కల్లోలం..
# 12 మంది మృతి

- మధ్యప్రదేశ్ సాగర్ జిల్లాలో కల్తీ మద్యం కలకలం
- విషపూరిత మద్యం తాగి 12 మంది మృతి.. 10 మందికి పైగా అస్వస్థత
- ఘటనపై సీఎం మోహన్ యాదవ్ సీరియస్.. ఉన్నతస్థాయి విచారణకు ఆదేశం
- నకిలీ మద్యం అమ్మకాలపై ముందే ఫిర్యాదులున్నా పట్టించుకోలేదని ఆరోపణలు
- పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు, ఆరు మద్యం దుకాణాలకు సీల్

**పెన్ పవర్ డెస్క్:**మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో కల్తీ మద్యం పెను విషాదాన్ని నింపింది. అనుమానాస్పద విషపూరిత మద్యం సేవించి 12 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 10 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా

- మిగతా 2లో



## కాంగ్రెస్ మాట విని తప్పుడు కేసులు
# పెడితే వదిలే ప్రసక్తే లేదు.. వడ్డీతో సహా చెల్లిస్తాం

### పోలీసులకు పువ్వాడ వార్నింగ్

- బీఆర్ఎస్ పాలనలో పోలీసులు పారదర్శకంగా విధులు నిర్వహించారన్న పువ్వాడ
- కాంగ్రెస్ నేతలకు అనుకూలంగా పనిచేస్తున్న అధికారుల జాబితా తమ వద్ద ఉందని వెల్లడి
- బీఆర్ఎస్ శ్రేణులను వేధిస్తే మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిక



- మిగతా 2లో

## తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఎన్నికల్లో
## 'మన ప్యానెల్' హవా.. అధ్యక్షుడిగా సి. కల్యాణ్



- ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఎన్నికల్లో 'మన ప్యానెల్' విజయభేరి
- అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సి. కల్యాణ్
- కోశాధికారిగా చదలవాడ శ్రీనివాసరావు ఘన విజయం
- చిన్న నిర్మాతల సమస్యల పరిష్కారమే లక్ష్యమన్న నూతన కార్యవర్గం
- కోర్టు కేసు కారణంగా నిలిచిపోయిన ప్రధాన కార్యదర్శి పదవి ఎన్నిక

- మిగతా 2లో



## శాస్త్రవేత్తలను బీజేపీ రాజకీయ పావులుగా వాడుకుంటోంది

- శాస్త్రవేత్తలను బీజేపీ ప్రభుత్వం రాజకీయ ప్రచారానికి వాడుకుంటోందన్న మాణికం టాగూర్
- విజయాలను ఘనంగా చెప్పుకుంటూ వారి కష్టాలను విస్మరిస్తోందని విమర్శలు
- జీతాలు, ఉద్యోగ భద్రతపై శాస్త్రవేత్తల ఆందోళనలు పట్టించుకోవడం లేదంటూ ఫైర్
- కాంగ్రెస్ నిర్మించిన ఇస్రోను కేంద్రం నిర్వీర్యం చేస్తోందని ఆరోపణ
- సైంటిస్టుల విజయాల్లో కనిపించే మోదీ.. సమస్యలపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీత

- మిగతా 2లో

## ఢిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం.. ఒకరి మృతి



**పెన్ పవర్ డెస్క్:**దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సౌత్ ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఒకరు మృతి చెందగా,

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# వరుస కట్టేసిన వారసులు.. బాబుకు తలనొప్పేనా?

వారసుల రంగ ప్రవేశం రాజకీయాల్లో కొత్తకాదు. అయితే.. ఎప్పుడూ.. ఇలాంటి సమస్య అసెంబ్లీ ఎన్నికల సమయం లోనే ఉంటుంది. తమ కుటుంబానికి చెందిన నాయకులను రంగంలోకి దింపేందుకునాయకులు సిద్ధంగా ఉంటా రు. అయితే.. ఇప్పుడు స్థానిక ఎన్నికల్లోనూ వారసుల పరంపర పెరుగుతోంది. వచ్చే ఎన్నికలకంటే ముందుగానే తమ వారసులను లైన్‌లో పెట్టుకునేందుకు మెజారిటీ సీనియర్ నేతలు.. రెడీ అయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబరు నాటికి స్థానిక ఎన్నికలు జరగనున్నాయి.

ఈ నేపథ్యంలో తమ వారికి అవకాశం ఇవ్వాలంటూ..నాయకులు జాబితాలను, ప్రొఫైళ్లను పార్టీకి పంపిస్తున్నారు. వీరిలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలతోపాటు.. ప్రస్తుతం ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. 130 మంది వారసులు రంగంలో ఉన్నారని.. పార్టీకి సమాచారం చేరింది. వీరిలో మెజారిటీ నాయకులు కార్పొరేషన్ మేయర్లు, మునిసిపాలిటీ చైర్మన్ పోస్టులకు ఎక్కువగా పోటీలో ఉండడం గమనార్హం. వాస్తవానికి ఇలాంటి పోస్టులకు.. ఎప్పుడూ డిమాండ్ ఉంటోంది.అయితే.. ఆయా పదవులు దక్కించుకునేందుకు ఎన్నికలు ముగిసిన తర్వాత తెరమీదకు వచ్చేవారు. కానీ, ఈ దఫా మేయర్, మునిసిపల్ చైర్మన్ పోస్టులను కూడా ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకోవాలని చంద్రబాబు నిర్ణయించా రు. దీనికి సంబంధించిన జీవో కూడా ఇచ్చారు. అన్నీ రెడీ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆయా పోస్టులను దక్కించుకునేందుకు నాయకులు తమ వారసులను బరిలో నిలపాలని నిర్ణయించుకున్నారు. ముఖ్యంగా కీలక నగరాలైన.. విజయవాడ, విశాఖ, కడప, కర్నూలు, నెల్లూరు, కృష్ణా, తిరుపతి వంటి ప్రాంతాల్లోపోటీ ఎక్కువగా ఉంది.ఒక పోస్టుకు ముగ్గురు నుంచి నలుగురు పోటీలో ఉండడం.. సిఫారసులు చేయించుకోవడంతోపాటు.. పార్టీపరంగా తాము ఏం చేస్తున్నామో కూడా వివరిస్తూ.. కొందరుఅధిష్టానాన్ని మెప్పించే పనిలో పడ్డారు. అయితే.. ఇక్కడ కీలక సమస్య తెరమీదికి వచ్చింది. వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకం కాకపోయిన.. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కష్టించిన వారు.. వెనుక ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేనివారిని ప్రోత్సహించాలని చంద్రబాబు భావిస్తున్నారు. కానీ, వారసత్వపు చిక్కులు ఆయనకు ముప్పుగా పరిణమిస్తున్నాయి. దీంతో ఈ వ్యవహారంపై తేల్చాలని నిర్ణయించుకున్నారు. మరి ఏం చేస్తారన్నది చూడాలి.

# వెలిగొండ ఫీడర్ కెనాల్‌లో యువకుల గల్లంతుపై మంత్రుల ఆరా

- మొదటి పేజి తరువాయి

అంచనా వేయడం కష్టం కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫీడర్ కెనాల్, నల్లమల సాగర్ దగ్గర పోలీస్, రెవెన్యూ అధికారులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

**మంత్రి గొట్టిపాటి ఆరా**

వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్‌లో యువకులు గల్లంతుపై మంత్రి గొట్టిపాటి రవి ఆరా తీశారు. ఎస్పీ, అధికారులతో మాట్లాడారు. యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. గత రెండు రోజుల నుంచి డ్రోన్‌ల ద్వారా గాలింపు చర్యలు చేపట్టినట్లు మంత్రికి అధికారులు తెలిపారు. ఫీడర్ కెనాల్ వెంట పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని ఎస్పీని మంత్రి కోరారు.

# శాస్త్రవేత్తలను బీజేపీ రాజకీయ పావులుగా వాడుకుంటోంది

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శాస్త్రవేత్తలను రాజకీయ పావులుగా వాడుకుంటోందని, వారి జీతభత్యాలు, ఉద్యోగ భద్రత, పని పరిస్థితుల వంటి కీలక సమస్యలను పూర్తిగా విస్మరిస్తోందని తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు, లోక్‌సభ ఎంపీ మాణికం ఠాగూర్ తీవ్రంగా విమర్శించారు. శాస్త్రవేత్తల శ్రమను గౌరవించకుండా, వారి విజయాలను తమ ఘనతగా ప్రచారం చేసుకుంటోందంటూ మండిపడ్డారు.ఆదివారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా మాణికం ఠాగూర్ ఈ ఆరోపణలు చేశారు. "భారత్ ప్రయోగించే రాకెట్లు, చంద్రుడు, సూర్యుడిపైకి పంపే మిషన్ల గురించి దేశం గర్విస్తోంది. కానీ, ఆ విజయాల వెనుక రేయింబవళ్లు శ్రమించిన శాస్త్రవేత్తల త్యాగాలు, మానసిక ఒత్తిడి ఉన్నాయి. కుటుంబాలకు దూరంగా ఉంటూ వారు చేసిన కృషిని ప్రభుత్వం గుర్తించడం లేదు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.ప్రతిష్ఠాత్మక ప్రయోగాల్లో భాగమైన శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ ఉద్యోగ భద్రత, సరైన జీతాల కోసం అధికారులకు వినతిపత్రాలు సమర్పించాల్సిన దుస్థితి రావడం ఆందోళనకరమని ఠాగూర్ ఆవేదన వ్యక్తం చేశారు. శాస్త్రీయ విజయాలను ప్రభుత్వం ఓవైపు వేడుకగా జరుపుకుంటూ, మరోవైపు ఆ విజయాలకు కారణమైన వారిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు.కాంగ్రెస్ హయాంలో విక్రమ్ సారాభాయ్ వంటి దార్శనికుల కృషితో దేశ స్వావలంబన

లక్ష్యంగా ఇస్రో ఒక ప్రభుత్వ రంగ సంస్థగా ఏర్పడిందని మాణికం ఠాగూర్ గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం దాదాపు ఆరు దశాబ్దాల శాస్త్రవేత్తల కృషిని బలహీనపరిచేలా కార్పొరేట్ ప్రయోజనాలకు పెద్దపీట వేస్తోందని, ఉద్యోగుల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెడుతోందని ఆరోపించారు.ప్రధాని నరేంద్ర మోదీపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. "ప్రయోగాలు విజయవంతమైనప్పుడు శాస్త్రవేత్తల పక్కన నిలబడి కెమెరాలకు ఫోజులిచ్చే ప్రధాని, వారు తమ హక్కులు, ఉద్యోగాల గురించి మాట్లాడినప్పుడు మౌనంగా ఉంటున్నారు. విజయాల ఘనతను తీసుకునే ప్రభుత్వం, ఆ విజయాన్ని అందించిన వారి కష్టాలను కూడా గుర్తించాలి" అని హితవు పలికారు. ఇస్రో దేశ ప్రతిష్ఠకు, స్వావలంబనకు చిహ్నమని, దాని ప్రభుత్వ రంగ స్వరూపాన్ని, శాస్త్రీయ లక్ష్యాలను కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ ప్రయోజనాల కోసం ఈ ప్రతిష్ఠాత్మక సంస్థను నిర్వీర్యం చేయడానికి అనుమతించకూడదని హెచ్చరించారు.

# నేటి నుంచే నూతన పింఛన్ల దరఖాస్తులు

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం క్రమం తప్పకుండా అందిస్తోంది. అయితే, వివిధ కారణాల వల్ల ఇప్పటివరకు పింఛను అందుకోలేకపోయిన పేదలకు, నూతనంగా అర్హత సాధించిన వారికి కూడా లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో నూతన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించింది.

**నూతన పింఛన్ల ప్రక్రియ – పూర్తి షెడ్యూల్**

సెప్టెంబర్ 7 – 16: నూతన పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ.

సెప్టెంబర్ 17 – 21: జనరల్ వెరిఫికేషన్ (సాధారణ పరిశీలన).

సెప్టెంబర్ 22 – 24: ఫిజికల్, శాఖాపరమైన ధ్రువీకరణ, అర్హతల నిర్ణయం.

సెప్టెంబర్ 25 – 26: 'సెర్ప్' (SERP) ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు, ప్రభుత్వ ఆమోద ప్రక్రియ.

దరఖాస్తు కేంద్రాలు: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 'స్వర్ణ గ్రామం – స్వర్ణ వార్డు' (గ్రామ/వార్డు సచివాలయ) కేంద్రాల్లో దరఖాస్తులను స్వీకరిస్తారు.

**ప్రత్యేక ఏర్పాట్లు**

దరఖాస్తుదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గాను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల వద్ద ముందస్తుగా ప్రత్యేక కౌంటర్లు,

సదుపాయాలు ఏర్పాటు చేశారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర చేనేత, గీత కార్మికులు, ఒంటరి మహిళలు అవసరమైన పత్రాలతో సమీప సచివాలయానికి వెళ్ళి తమ దరఖాస్తులను అందజేయాలని అధికారులు సూచించారు. అందిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ త్వరితగతిన నూతన పింఛన్లు మంజూరు చేయనున్నారు.

## తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఎన్నికల్లో

# 'మన ప్యానెల్' హవా.. అధ్యక్షుడిగా సి. కల్యాణ్

తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ (2026–28) నూతన కార్యవర్గం కోసం జరిగిన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో 'మన ప్యానెల్', 'ప్రోగ్రెసివ్ ప్యానెల్' మధ్య ప్రధాన పోటీ జరగ్గా, 'మన ప్యానెల్' స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించి కీలక పదవులను కైవసం చేసుకుంది. అధ్యక్ష పదవికి సి. కల్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే.ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన పోలింగ్‌లో మొత్తం 1,168 మంది సభ్యులకు గాను 643 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించారు. అత్యంత కీలకమైన కోశాధికారి (ట్రెజరర్) పదవికి 'మన ప్యానెల్' నుంచి పోటీ చేసిన చదలవాడ శ్రీనివాసరావు విజయం సాధించారు. ఉపాధ్యక్ష పదవులకు 'మన ప్యానెల్' నుంచి మోహన్ వడ్లపల్లి, 'ప్రోగ్రెసివ్ ప్యానెల్' నుంచి దామోదర్ ప్రసాద్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా 'మన ప్యానెల్' అభ్యర్థులు అమ్మిరాజు, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ గెలుపొందారు.

ఇక కార్యవర్గ సభ్యుల (ఈసీ మెంబర్స్) పదవుల్లోనూ 'మన ప్యానెల్' హవా కొనసాగింది. ఈ ప్యానెల్ నుంచి పద్మిని, ఏషియన్ సునీల్, మోహన్ గౌడ్, శివలెంక కృష్ణప్రసాద్, దానయ్య సహా మొత్తం 12 మంది విజయం సాధించగా, 'ప్రోగ్రెసివ్ ప్యానెల్' నుంచి మైత్రీ రవి, నిరంజన్ రెడ్డి, డీఎస్ రావు సహా ముగ్గురు గెలుపొందారు. అయితే, ప్రధాన కార్యదర్శి పదవి ఎన్నిక కోర్టు కేసు కారణంగా ప్రస్తుతానికి నిలిచిపోయింది.

ఈ సందర్భంగా అధ్యక్షుడు సి. కల్యాణ్ మాట్లాడుతూ, తమ ప్యానెల్‌కు దాదాపు 95 శాతం మద్దతు ఇచ్చిన నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా చిన్న నిర్మాతలు ఎదుర్కొంటున్న విడుదల సమస్యలు, ఆర్థిక ఇబ్బందులపై దృష్టి సారిస్తామన్నారు. వారి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. తన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన బండ్ల గణేశ్‌కు ధన్యవాదాలు చెబుతూ, ఇకపై అందరం కలిసికట్టుగా పనిచేస్తామని పిలుపునిచ్చారు.

కోశాధికారిగా ఎన్నికైన చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ, తన గెలుపునకు ఎన్టీఆర్ ఆశీస్సులు, నందమూరి కుటుంబం మద్దతు కూడా కారణమని పేర్కొన్నారు. చిన్న నిర్మాతలకు అండగా ఉంటూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని, ప్రభుత్వ సహకారం కూడా తీసుకుంటామని తెలిపారు. మొత్తంగా, నిర్మాతల మండలిలో 'మన ప్యానెల్' విజయంతో చిన్న నిర్మాతల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మధ్యప్రదేశ్‌లో కల్తీ మద్యం కల్లోలం.. 12 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

తీవ్ర కలకలం రేపడంతో ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. ప్రభావిత గ్రామాల్లో వైద్య పరీక్షలు ప్రారంభించి, ముందుజాగ్రత్త చర్యగా పలు మద్యం దుకాణాలను సీల్ చేశారు.ఈ ఘటనపై ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. "సంబంధిత మంత్రి, అధికారులను వెంటనే ఘటనా స్థలానికి వెళ్లాలని ఆదేశించాను. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తాం. ఇలాంటి వాటిని మా ప్రభుత్వం ఎంతమాత్రం సహించదు" అని ఆయన మీడియాకు తెలిపారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

**అధికారుల నిర్లక్ష్యంపై ఆరోపణలు**

ఈ మరణాల నేపథ్యంలో జిల్లాలో అక్రమ, నకిలీ మద్యం అమ్మకాలపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. "బాంబే విస్కీ" పేరుతో ఓ నకిలీ బ్రాండ్‌ను విక్రయిస్తున్నారని, దీనిపై ఓ మద్యం కాంట్రాక్టర్ ఇటీవలే ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని స్థానిక కథనాలు పేర్కొంటున్నాయి. నాలుగు రోజుల క్రితం లైసెన్స్ పొందిన మద్యం కాంట్రాక్టర్లు సైతం ఎక్సైజ్ అధికారులతో జరిగిన సమావేశంలో నకిలీ మద్యం అమ్మకాలపై ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**మిథైల్ ఆల్కహాల్‌గా అనుమానం**

కల్తీ మద్యం సేవించి అస్వస్థతకు గురైన వారిలో తీవ్రమైన లక్షణాలు కనిపిస్తున్నాయని వైద్యులు తెలిపారు. శరీరం నీలంగా మారడం (సైనోసిస్), కండరాలు బిగుసుకుపోవడం వంటివి గమనించినట్లు చెప్పారు. ఇది మిథైల్ ఆల్కహాల్ పాయిజనింగ్ కావచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నట్లు చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ దేవేష్ పటేరియా తెలిపారు.

"ప్రస్తుతం 9–10 మంది మరణించినట్లు మాకు సమాచారం ఉంది. మా వైద్య బృందాలు మూడు గ్రామాల్లో ఇంటింటి సర్వే చేస్తున్నాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత 24 నుంచి 48 గంటల్లో మద్యం సేవించి వాంతులు, తలనొప్పి, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి రావాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రస్తుతం నౌరా, ఘుగ్రు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా అధికారులు ఆ ప్రాంతంలోని ఆరు మద్యం దుకాణాలను సీల్ చేసి, అనుమానాస్పద మద్యం నమూనాలను పరీక్షల కోసం సేకరించారు. అసలు ఈ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు సరఫరా చేశారనే కోణంలో పోలీసులు, పరిపాలన యంత్రాంగం దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికలు అందిన తర్వాతే మరణాలకు కచ్చితమైన కారణాలు తెలుస్తాయని అధికారులు వెల్లడించారు.

# ఢిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం.. ఒకరి మృతి

- మొదటి పేజి తరువాయి

ఇప్పటివరకు ఆరుగురిని సహాయక బృందాలు సురక్షితంగా వెలికితీశాయి. శిథిలాల కింద మరికొంతమంది చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కూలిపోయిన భవనం సుమారు 40–50 ఏళ్ల నాటిది. బేస్‌మెంట్‌తో కలిపి మొత్తం ఐదు అంతస్తులున్న ఈ భవనాన్ని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంగా ఉపయోగిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శిథిలాల కింద నుంచి వెలికితీసిన ఒక వ్యక్తిని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హుడా మాట్లాడుతూ, ఇది రాజకీయ విమర్శలు చేసే సమయం కానప్పటికీ, జవాబుదారీతనం ఎక్కడ అని ప్రశ్నించారు. "ఈ ప్రాంతంలో పీజీలు ఏ పరిస్థితుల్లో నడుస్తున్నాయో అందరికీ తెలుసు. వాటికి లేఅవుట్ ప్లాన్లను ఎవరు మంజూరు చేస్తున్నారు? అగ్నిమాపక భద్రతను ఎవరు ధ్రువీకరిస్తున్నారు? మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేల పాత్ర ఏమిటి? ఎవరో ఒకరు బాధ్యత వహించాలి" అని ఆయన నిలదీశారు. విద్యార్థులే శిథిలాల నుంచి ముగ్గురిని బయటకు లాగారని, ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ ఘటనను అత్యంత విషాదకరమని అభివర్ణించారు. "ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఢిల్లీలో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా నిద్రమత్తు వీడి పౌరుల భద్రతకు చర్యలు తీసుకోవాలి" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత, మాజీ సీఎం అతిషి కూడా ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావని ఆమె పేర్కొన్నారు.

సమీపంలోనే ప్రచారం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్, తాము ఘటనాస్థలికి చేరుకుని ముగ్గురిని కాపాడామని తెలిపారు. ప్రమాద స్థలంలో విద్యార్థులకు చెందిన పుస్తకాలు కనిపించాయని, ప్రభుత్వ వైఫల్యమే ఈ దుర్ఘటనకు కారణమని ఆరోపించారు.

ప్రమాదం

జరిగిన భవనం పక్కనే ఉన్న పీజీలో నివసించే ఓ విద్యార్థి మాట్లాడుతూ, "భోజనం చేశాక ఒక్కసారిగా భూకంపం వచ్చినట్లు భవనం కంపించింది. బాల్కనీలోకి వచ్చి చూస్తే అంతా దుమ్ముతో నిండిపోయింది. కిందకు దిగాక భవనం కూలిందని అర్థమైంది. అధికారుల కంటే ముందే మేం ఒకరిని శిథిలాల నుంచి బయటకు లాగాం" అని తెలిపారు. మరో ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ, ఇంకా 20–30 మంది శిథిలాల కింద చిక్కుకొని ఉండవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

## కాంగ్రెస్ మాట విని తప్పుడు కేసులు

# పెడితే వదిలే ప్రసక్తే లేదు.. వడ్డీతో సహా చెల్లిస్తాం

అధికార కాంగ్రెస్ నేతల ఒత్తిళ్లకు లొంగిపోయి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకోబోమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ కుమార్ పోలీసు యంత్రాంగాన్ని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైరా నియోజకవర్గం జూలూరుపాడులో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ హయాంలో 'ఫ్రెండ్లీ పోలీసింగ్'తో పారదర్శకంగా విధులు నిర్వహించిన వ్యవస్థను, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయాల కోసం హింసను ప్రోత్సహించేలా వాడుకుంటోందని తీవ్రంగా ధ్వజమెత్తారు.

తెలంగాణలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేసిన పువ్వాడ... అధికార పార్టీ నేతల సైగలకు అనుగుణంగా తప్పుడు పనులు చేస్తున్న పోలీసు అధికారుల జాబితా తమ దగ్గర సిద్ధంగా ఉందన్నారు. చట్టాన్ని పక్కనపెట్టి బీఆర్ఎస్ శ్రేణులను వేధిస్తున్న ప్రతీ ఒక్కరికీ భవిష్యత్తులో వడ్డీతో సహా చెల్లిస్తామని ఘాటుగా హెచ్చరించారు. పోలీసులు ఇకనైనా ఏకపక్ష వైఖరిని విడనాడి, నిష్పాక్షికంగా చట్టపరిధిలో పనిచేయాలని సూచించారు.

# రాజమండ్రిలో కుండపోత.. రోడ్లన్నీ జలమయం

- మొదటి పేజి తరువాయి

నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.సాయంత్రం పనుల మీద బయటకు వెళ్లినవారు, ఇళ్లకు తిరిగి వెళ్లేవారు అకస్మాత్తుగా కురిసిన వర్షంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతిసారీ చిన్నపాటి వర్షానికే నగరం ఇలా జలదిగ్బంధంలో చిక్కుకోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ వైఫల్యం కారణంగానే ఈ దుస్థితి తలెత్తుతోందని వారు ఆరోపిస్తున్నారు.

# హైదరాబాద్‌లో ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్

కొందరు ట్రాన్స్‌జెండర్లు శుభకార్యాల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి బెదిరింపులు, దోపిడీలను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ప్రత్యేక డ్రైవ్ (స్పెషల్ డ్రైవ్) చేపట్టాలని అన్ని కమిషనరేట్ల సీపీలను ఆదేశించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశ వేడుకలో ట్రాన్స్‌జెండర్లు రూ. 50,000 డిమాండ్ చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో డీజీపీ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.సెప్టెంబర్ 4న చింతల్ ప్రాంతంలో ఓ కుటుంబం తమ నూతన గృహంలోకి ప్రవేశించేందుకు రాగా, కొందరు ట్రాన్స్‌జెండర్లు వారిని అడ్డుకున్నారు. ఇంట్లోకి వెళ్లాలంటే రూ. 50,000 ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని బాధితులు చెప్పినా వినకుండా అసభ్యంగా ప్రవర్తించి, శాపనార్థాలు పెట్టారని బాధితురాలు వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించడంతో, ఇలాంటి వసూళ్ల దందాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు పోలీసులను కోరారు.ఈ ఘటనపై స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్, ఇటీవల కాలంలో ఇలాంటి ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని అంగీకరించారు. తాను హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడు కూడా ఇలాంటి బెగ్గింగ్ రాకెట్లు, బలవంతపు వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నియంత్రించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ అదే తరహా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.అదే సమయంలో, ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని డీజీపీ ప్రస్తావించారు. ప్రభుత్వ చొరవతో ఎందరో ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, ఇతర విభాగాల్లో ఉద్యోగాలు పొంది ఎలాంటి ఫిర్యాదులు లేకుండా మంచి పేరు తెచ్చుకుంటున్నారని ఆయన వివరించారు.

# ఇండోనేషియాలో అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలు..

## విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం

ఇండోనేషియాలోని అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం మరోసారి బద్దలైంది. శుక్రవారం రాత్రి నుంచి ఉగ్రరూపం దాల్చిన ఈ అగ్నిపర్వతం నుంచి వెలువడుతున్న బూడిద, ధూళి మేఘాల కారణంగా రాజధాని జకార్తాలో విమాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముందుజాగ్రత్త చర్యగా సోకర్నో–హట్టా అంతర్జాతీయ విమానాశ్రయంలో 300కు పైగా విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. దీంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.జావా, సుమత్రా దీవుల మధ్య ఉన్న ఈ అగ్నిపర్వతం నుంచి వెలువడిన బూడిద ఆదివారం ఉదయం జకార్తా విమానాశ్రయ పరిసరాలను కమ్మేసింది. దీంతో అధికారులు తొలుత ఉదయం 9:30 గంటల వరకు, ఆ తర్వాత సాయంత్రం 5:30 గంటల వరకు విమాన రాకపోకలను నిలిపివేశారు. మొత్తం 301 విమానాలను రద్దు చేయగా, వాటిలో 58 అంతర్జాతీయ సర్వీసులు ఉన్నాయి. ఈ పరిణామంతో 22,000 మందికి పైగా ప్రయాణికులపై ప్రభావం పడింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్, మలేషియా ఎయిర్‌లైన్స్ వంటి సంస్థలు జకార్తాకు తమ సర్వీసులను రద్దు చేసుకున్నాయి. సింగపూర్, దోహా, సిడ్నీ, కౌలాలంపూర్ వంటి ప్రధాన మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి.

అగ్నిపర్వతం నుంచి బూడిద మేఘాలు జావా వైపు 20,000 అడుగులు, సుమత్రా వైపు 50,000 అడుగుల ఎత్తు వరకు వ్యాపించాయి. నిరంతర భూ ప్రకంపనలు, లావా వెదజల్లడం, భారీ శబ్దాలతో ఆ ప్రాంతం దద్దరిల్లుతోంది. బూడిద కారణంగా కంటికి సంబంధించిన సమస్యలు తలెత్తడంతో కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. మత్స్యకారులు కూడా సముద్రంలోకి వేటకు వెళ్లలేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్లేటప్పుడు మాస్కులు, కళ్లజోళ్లు తప్పనిసరిగా ధరించాలని ఇండోనేషియా విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది.ప్రస్తుతానికి సునామీ ముప్పు ఏదీ లేదని అధికారులు స్పష్టం చేసినప్పటికీ, ప్రజల్లో ఆందోళన నెలకొంది. 2018లో ఇదే అగ్నిపర్వతం విస్ఫోటనం కారణంగా సంభవించిన సునామీలో 400 మందికి పైగా మరణించారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటంతో ఇండోనేషియాలో తరచూ అగ్నిపర్వతాలు, భూకంపాలు సంభవించడం సాధారణమే.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకున్న విజయరేఖ

**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 6**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా వలేటివారిపాలెం మండలం జెడ్ ఉప్పలపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న దాసరి విజయరేఖ ను2026 ప్రకాశం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపిక చేశారు.శనివారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయరేఖ దంపతులను ప్రకాశం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు,ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, డిఈఓ రేణుక ఘనంగా సన్మానించి మెమంటోను అందజేశారు.




# పెన్ పవర్

మార్కాపురం - ప్రకాశం





# మార్కాపురంలో మున్సిపల్ ఫైట్ షురూ..!

**40 వార్డులు.. కొత్త రాజకీయ సమీకరణాలు.. రిజర్వేషన్ల ఉత్కంఠ. ఆశావాహుల హడావుడి.. ప్రధాన పార్టీల వ్యూహ ప్రతి వ్యూహాలు.. వెరసి మార్కాపురం మున్సిపల్ ఎన్నికలు రారున్న రోజుల్లో మరింత ఆసక్తిగా మారే అవకాశాలు కల్పిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం కొత్త వ్యూహాలతో ముందుకు సాగుతుండగా.. వైసీపీ మాత్రం తమ పట్టు నిలబెట్టుకునేందుకు వ్యూహాలు రచిస్తోంది. రిజర్వేషన్లు తేలిన తర్వాత మున్సిపల్ పీఠంపై చివరికి ఎవరు జెండా ఎగరవేస్తారు.? అనేదే ఇప్పుడు మార్కాపురం ప్రజల్లో ఆసక్తికర చర్చగా మారింది.**

## మార్కాపురం మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది
## 35 నుంచి 40కి చేరిన వార్డులు
## 40 వార్డులతో కొత్త రాజకీయ సమరం
## కూటమి వర్సెస్ వైసీపీ హోరాహోరీకి రంగం సిద్ధం
## కూటమి కొత్త వ్యూహాలతో ముందుకు సాగుతుండగా వైసీపీ తమ పట్టును నిలబెట్టుకునేందుకు సమాయత్తమవుతోంది

**మార్కాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 6**

మార్కాపురం మున్సిపాలిటీ ఎన్నికలకు సైరన్ మోగింది. వార్డుల సంఖ్య 35 నుంచి 40కి పెరగడం, రిజర్వేషన్లు తేలాల్సి ఉండటంతో స్థానికంగా రాజకీయ వేడి ఒక్కసారిగా పెరిగింది. గతంలో వైసీపీ కంచుకోటగా ఉన్న ఈ మున్సిపాలిటీని ఈసారి ఎలాగైనా కైవసం చేసుకోవాలని అధికార కూటమి వ్యూహాలు రచిస్తోంది. మరోవైపు పీఠాన్ని నిలబెట్టుకునేందుకు వైసీపీ ఇన్-చార్జ్ అన్నా రాంబాబు గట్టిగానే కసరత్తు చేస్తున్నారు. దీంతో మార్కాపురం పీఠం కోసం కూటమి, వైసీపీ మధ్య హోరాహోరీ పోరు తప్పదనే చర్చ జరుగుతోంది.

**35 నుంచి 40కి పెరిగిన వార్డులు..**

జనాభా పెరుగుదల, శివారు కాలనీల విలీనంతో మార్కాపురం మున్సిపాలిటీ వార్డుల సంఖ్య 35 నుంచి 40కి పెరిగింది. ఎలాంటి కోర్టు వివాదాలు, పిటిషన్లు లేకపోవడంతో అధికారులు డీలిమిటేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేశారు. కొత్తగా పెరిగిన 5 వార్డుల్లో యువ, బీసీ ఓటర్లు నిర్ణయాత్మకంగా ఉండబోతున్నారు.

**గతంలో వైసీపీ ఘన విజయం..**

గత మున్సిపల్ ఎన్నికల్లో మార్కాపురంలో వైసీపీ ఘన విజయం సాధించింది. 35 వార్డులకు గాను 30కి పైగా వార్డుల్లో వైసీపీ జెండా ఎగిరింది. అప్పుడు చైర్మన్ పీఠం ఓసీ కి రావడం వైసీపీకి కలిసొచ్చింది. ఈసారి ఏ రిజర్వేషన్ వస్తుందోననే ఉత్కంఠ నెలకొంది.

**సిట్టింగ్ ఎమ్మెల్యే కందుల వ్యూహం..**

ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో మార్కాపురం పీఠాన్ని దక్కించుకోవడం సిట్టింగ్ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి ప్రతిష్టాత్మకంగా మారింది. ఆయన ఇప్పటికే వార్డుల వారీగా ఇన్-చార్జులను నియమించి గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టారు. టీడీపీ 30కి పైగా వార్డుల్లో పోటీ చేసేలా లెక్కలు వేస్తోంది.

**జనసేన బలం.. ఇమ్మడి కాశీనాథ్ పట్టు..**

మార్కాపురం పట్టణంలో జనసేన బలం గణనీయంగా పెరిగింది. నియోజకవర్గ ఇన్-చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ నేతృత్వంలో జనసేన కేడర్ యాక్టివ్ గా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి గెలుపులో కీలక పాత్ర పోషించిన జనసేన, ఈసారి మున్సిపాలిటీలో 5 నుంచి 10 వార్డులు ఆశిస్తున్నట్లు సమాచారం.

**బీజేపీకి సొంత జిల్లా అధ్యక్షుడు అండ..**

బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు మార్కాపురం పట్టణానికి చెందినవారే కావడం ఆ పార్టీకి కలిసొచ్చే అంశం. గతంలో నామమాత్రంగా ఉన్న బీజేపీ, ఈసారి 3 నుంచి 5 వార్డుల్లో అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు తెలుస్తుంది. తమకు బలం ఉన్న వార్డుల్లో కమలం గుర్తును ఎగరేయాలని చూస్తోంది.

**వైసీపీ నుంచి అన్నా రాంబాబు దూకుడు..**

వైసీపీ ఇన్-చార్జ్ అన్నా రాంబాబు కూడా పీఠాన్ని వదులుకునేలా లేరు. వచ్చే ఎన్నికల్లో జగన్ మళ్లీ సీఎం కావాలంటే ఈ మున్సిపాలిటీ ఎన్నికలే ప్రధాన ఆసరా అని జగన్ ఇప్పటికే ఇన్-చార్జ్ లకు చెప్పినట్లు సమాచారం. దీంతో అన్నా రాంబాబు పాత కౌన్సిలర్లు, ముఖ్య నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ కేడర్ ను కాపాడుకునే పనిలో ఉన్నారు.

**ఫైనల్ గా రిజర్వేషన్ పైనే ఆధారం..**

మొత్తానికి మార్కాపురం చైర్మన్ పీఠం రిజర్వేషన్ ఏ కేటగిరీకి వస్తుందనే దానిపైనే సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపిక ఆధారపడి ఉంది. ఓసి,బీసీ ఎస్సీ, మహిళా.. ఏది వచ్చినా అందుకు తగ్గట్టుగా కూటమి, వైసీపీ రెండూ వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి.

# నిర్మించారు... ప్రారంభం మరిచారు..!

## పుల్లల చెరువు బస్టాండ్ లో నిరుపయోగంగా మరుగుదొడ్లు మహిళా ప్రయాణికుల అవస్థలు..




**పుల్లల చెరువు పెన్ పవర్ సెప్టెంబర్ 6**

మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల సౌక ర్యార్థం మరుగుదొడ్లు నిర్మించారు. అయితే నిర్మాణం పూర్తయినా వాటిని ప్రారంభించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావడాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు మరిచి పోయారనే విమర్శలు వినిపిస్తు న్నాయి. దీంతో ప్రజాధనం వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి.నిత్యం వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికులతో బస్టాండ్ రద్దీగా ఉంటుంది.ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో బస్సుల కోసం వేచి ఉంటుంటారు. అయితే బస్టాండ్ లో నిర్మించిన మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో అత్యవసర సమయంలో మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**అవసరానికి వెళ్లాలంటే అవస్థలే..!**

మరుగుదొడ్లు ఉన్నప్పటికీ వినియోగంలోకి రాకపోవడంతో ప్రయాణికులు బస్టాండ్ పరిసర ప్రాంతాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మహిళలకు ఈ సమస్య మరింత ఇబ్బందికరంగా మారింది. బస్టాండ్‌కు సమీపంలోని చాటు మార్గాలను ఉపయోగించుకోవాల్సి వస్తోందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇలాంటి సమయంలో అక్కడికి పురుషులు మహిళలు ఒకే సారి కలిసి వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు.పురుషులు రావడంతో మహిళలు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. మహిళల భద్రతకు సంబంధించిన అంశమైనప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు బస్టాండ్‌లో మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ వాటిని ప్రారంభించి వినియోగంలోకి తీసుకురాకపోవడం ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణం పూర్తి చేయడమే కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు పేర్కొంటున్నారు. మరుగుదొడ్లు నిర్మించి ప్రారంభించకుండా వదిలేయడం వల్ల ప్రభుత్వ నిధులు ఖర్చు చేసినా ప్రజలకు ప్రయోజనం లేకుండా పోతోందని పలువురు అంటున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరుగుదొడ్లను వెంటనే ప్రారంభించి మహిళా ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. అలాగే బస్టాండ్ పరిసరాల్లో ఆకతాయిల సంచారంపై నిఘా పెంచి మహిళలకు భద్రత కల్పించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. మరుగుదొడ్లు నిర్మించారు.. ప్రారంభించడం మాత్రం మరిచారు అంటూ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పోకూరులో బస్సు షెల్టర్ కరువు

## ఎండా వానల్లో ప్రయాణికుల నరకయాతన!



**వలేటివారిపాలెం, పెన్ పవర్ సెప్టెంబర్ 6:**

పోకూరు గ్రామ బస్టాండ్ సెంటర్ లో బస్సు షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇది కందుకూరు, పామూరు శాఖవరం విఆర్ కోట గ్రామాల నాలుగు ప్రాంతాలకు ప్రధాన కూడలి కావడంతో రోజూ వందలాది మంది విద్యార్థులు, మహిళలు, రైతులు, ఉద్యోగులు బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఈ సమయంలో బస్సు సెంటర్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**ఎండకు వానకు దిక్కులేని పరిస్థితి:** షెల్టర్ లేకపోవడంతో ఎండలో మండిపోతూ, వానలో తడుస్తూ రోడ్డు పక్కనే నిలబడాల్సిన దుస్థితి. కూర్చోవడానికి స్థలం లేక వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**అధికారులు స్పందించాలి:**

సంవత్సరాలుగా ఈ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, వెంటనే బస్టాండ్ సెంటర్ లో ఆధునిక బస్సు షెల్టర్ నిర్మించి ప్రయాణికుల కష్టాలు తీర్చాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

# టిఆర్ఆర్ అధ్యాపకురాలికి రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు




**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 6**

టి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), కందుకూరుకు చెందిన రసాయన శాస్త్ర అధ్యాపకురాలు డా. కె.వి. పద్మావతి కి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డు రావడం తమ కళాశాలకు ఎంతో గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. రవి కుమార్ తెలియజేశారు. డా. పద్మావతి గత ఐదు సంవత్సరాలుగా మన కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారని, కళాశాల విద్యాశాఖ విభాగంలో ఆమె ఈ అవార్డుకు ఎంపికయ్యారని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారని ఆయన తెలిపారు. పద్మావతి తన 30 సంవత్సరాల సుదీర్ఘ బోధనానుభవంతో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారని, రసాయన శాస్త్రంలో పలు పరిశోధనా పత్రాలను ప్రతిష్టాత్మక జర్నల్స్ లో ప్రచురించారని, ప్రస్తుతం పలువురు పరిశోధక విద్యార్థులకు పీహెచ్డీ పర్యవేక్షకురాలిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ గా, ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం, ఒంగోలు వారి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలిగా సేవలందించారని, స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మియావాకి ఫారెస్ట్ ప్రాజెక్టులో మొక్కలు నాటే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈ అవార్డు రావడం కళాశాలకు గర్వకారణమని, డా. పద్మావతి ని కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారని ప్రిన్సిపాల్ తెలియజేశారు.

# అభివృద్ధి, సంక్షేమ కరపత్రాలతో ఇంటింటికీ ఎమ్మెల్యే ఇంటూరి

## ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన -గ్రామాల్లో మార్పు తెచ్చారంటూ స్థానికుల ధన్యవాదాలు

## మోచర్ల ఎస్సీ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే

**గుడ్లూరు, పెన్ పవర్, సెప్టెంబరు 06**

రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాన్ని మండలంలోని మోచర్ల ఆదిఆంధ్ర కాలనీలో ఆదివారం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కూటమి ప్రభుత్వంలో చేసిన కార్యక్రమాలను వివరిస్తూ, ఇంటింటికి తిరిగి సంక్షేమ, అభివృద్ధి కరపత్రాలు గృహాలవారికి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఈ రెండేళ్లలో అభివృద్ధి కార్యక్రమాలు ఎక్కువగా చేశారని కాలనీవాసులు ఎమ్మెల్యేపై ప్రశంసలు కురిపించారు. గ్రామాల్లో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయని గ్రామస్తులు కొనియాడారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ మోచర్ల పంచాయతీలో 66.2 లక్షలతో అభివృద్ధి పనులు చేయగా, సంక్షేమ పథకాల అమలు కోసం 12.28 కోట్లు ఖర్చు చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. 26.66 లక్షలతో మూడు సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు 14.48 లక్షలతో పెద్ద చెరువు తూము మరియు సాగునీటి కాలువలను పునరుద్ధరించామని ఆయన చెప్పారు. పంచాయతీ, మండల పరిషత్ ద్వారా 25 లక్షలు ఖర్చుచేసి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. సంక్షేమానికి సంబంధించి ప్రతినెలా వివిధ రకాల పింఛన్ల కోసం 21.79 లక్షలు మంజూరు అవుతున్నాయని ఎమ్మెల్యే తెలియజేశారు. తల్లికి వందనం పథకం ద్వారా 476 మందికి 1.42 కోట్లు, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 576 మంది రైతులకు 1.55 కోట్ల రూపాయలను బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో మండల టిడిపి అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ పెదబాబు, పార్టీ నాయకులు మద్దసాని శ్రీను, మద్దసాని వెంకటేశ్వర్లు, దారా వెంకట్రావు, గోచిపాతల కోటేశ్వరరావు, తాటిపర్తి సునీల్, తలకాయల శేషయ్య, షేక్ పెదబాబు, చిత్తారి మల్లికార్జున, యర్రంశెట్టి వెంకటేశ్వర్లు, గద్దగుంట రామకృష్ణ, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు , మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# సరస్వతీ దేవి విగ్రహా ప్రారంభోత్సవంలో పాల్గొన్న టీడీపీ నేత కృష్ణ కిషోర్




**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 6**

గిద్దలూరు మండలం, నరవ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సరస్వతీ దేవి విగ్రహా ప్రారంభోత్సవ కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం స్థానిక టీడీపీ నాయకులు కృష్ణ కిషోర్ కు ఘనస్వాగతం పలికారు. పండితులు నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొని విగ్రహా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు మండల విద్యాధికారి, స్థానిక టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# పి.జి.ఆర్.ఎస్ ను సద్వినియోగం చేసుకోవాలి

**- పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100**

**- క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయవచ్చు**



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ సెప్టెంబర్ 06:**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)ను ప్రతీ సోమవారం జిల్లా, మండల స్థాయిలో అన్ని కార్యాలయాల్లో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజ బాబు తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి అర్జీల వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. మీ కోసం వెబ్ సైట్ లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు నేరుగా సోమవారం నిర్వహిస్తున్న పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు సమర్పించవచ్చని లేదా మీ కోసం వెబ్ సైట్ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) లో కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పి.జి.ఆర్.ఎస్ కు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1100 ను వినియోగించుకొని, ఆర్జీల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని సూచించారు. క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయవచ్చని చెప్పారు.

# భగవద్గీత శ్లోకాలు పునఃశ్చరణ

**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ సెప్టెంబర్ 06**

చిన్మయ మిషన్ నిర్వాహకులు సత్యాత్మానంద స్వామి శ్రీగిరి బాలవిహార్ విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలను నేర్పించడం తో పాటు వాటిని ఎలా ఉచ్చరించాలో ఏ పదాన్ని ఎలా పలకాలో పోటీలలో విజయం సాధించాలంటే తడబాటు లేకుండా శ్లోకాలను చక్కగా పలకడం చెప్పడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆదివారం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీగిరి గోశాల భవన్లో ఏర్పాటు అయిన బాలవిహార్ శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. భగవద్గీత భక్తి యోగంలోని శ్లోకాలను వల్లె వేయించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి పర్యవేక్షించారు. భగవద్గీత శిక్షకురాలు గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.



# రాజ్యాధికారంలో కీలక భాగస్వాములుగా ఎదగాలి

## - ముస్లిం నేతల పిలుపు - ఒంగోలులో ముస్లింల ఆలోచనాపరుల ఆత్మీయ సమావేశం





**ఒంగోలు టౌన్, పెన్ పవర్ సెప్టెంబర్ 06**

ముస్లిలు ఏ పార్టీలో ఉన్న రాజ్యాధికారంలో కీలక భాగస్వామిగా స్థానిక సంస్థల నుండి, శాసనసభ శాసనమండలి, లోక్ సభ, రాజ్యసభలలో ప్రాతినిధ్యాన్ని పెంచుకొని దిశగా ముస్లిం సమాజం ఆలోచించాలని అందుకు ముస్లింలందరూ పార్టీలకు అతీతంగా ముస్లిం అభ్యర్థుల గెలుపు కోసం తమ వంతు పాత్ర పోషించాలని ముస్లిం నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం ఒంగోలులోని ఇస్లాంపేటలో గల ముస్లిం కమ్యూనిటీ హాలులో ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముస్లిం ఆలోచనాపరుల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ రఫీ అధ్యక్షతన వహించగా, సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ రఫీ సమన్వయ కర్తగా వ్యవహరించారు. సందర్భంగా ముస్లిం నాయకులు మాట్లాడుతూ ముస్లిం సమాజం ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా చాలా వెనుకబడి ఉందని ముస్లింలను రాజకీయపరమైన ప్రాధాన్యత ఇవ్వకుండా అన్ని రాజకీయ పార్టీలు దూరం పెడుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉద్యోగ ,వ్యాపార రంగాలలో ఒకప్పుడు అగ్రస్థానంలో ఉన్న ముస్లిం సమాజం ఇప్పుడు అన్నీ రంగాలలో వెనుకబడి ఉందన్నారు. ఎవరు ఒప్పుకున్నా లేకున్నా ముస్లిం వెనకబాటుకు మతపరమైన వివక్ష అలాగే ముస్లిం సమాజ చైతన్య రాహిత్యం కూడా దీనికి కారణం అని పేర్కొన్నారు. దీనిని అధిగమించడానికి ముస్లిలు ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. పదిహేను శాతం ఉన్న మనకు నామమాత్రపు గుర్తింపు లేకుండా పోయింది, ఆత్మగౌరవం దిశగా ముస్లిం సమాజం ఆలోచించడం మానేసి ఎవరికి వారు పార్టీలు గానో విడిపోయి సొంత అభివృద్ధి కి దూరమై పోతున్నామని ఈ సమావేశం అభిప్రాయపడింది. ముస్లిం సమాజానికి అందుబాటులో ఉంటామని, వారి సమస్యల పరిష్కారం తోపాటు అభివృద్ధి కి తోడ్పాటు అందచేస్తామని నేతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ షేక్ రియాజ్, ఏపీ హజ్ కమిటీ డైరెక్టర్ మౌలానా షేక్ ఆబిద్ ఖాస్మీ టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ నాయకులు షేక్ కఫిల్ బాషా, పఠాన్ హనీఫ్ ఖాన్, వైఎస్ఆర్ సీపి రాష్ట్ర మైనారిటీ నాయకులు షంషీర్ అహ్మద్, ప్రకాశం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు షేక్ సైదా, ఏపీ సినీ సెన్సార్ బోర్డు మాజీ డైరెక్టర్ షేక్ షాజహాన్, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఇస్మాయిల్, పఠాన్ కరిముల్లా ఖాన్, షేక్ శిలార్,సయ్యద్ సర్దార్, షేక్ అబ్దుల్ రషీద్,కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ మహబూబ్ అలి, షేక్ అబ్దుల్ రవూఫ్, నవ్యాంధ్ర మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఇంటూరిని కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు



**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 6**

విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధి, సంక్షేమానికి ఉపయోగపడే విధంగా గతంలో కేటాయించిన స్థలంలో ఆరామ క్షేత్రాన్ని నిర్మించాలని కోరుతూ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, ప్రసాద్ తదితర విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యేను కలిసి ఆరామ క్షేత్రం నిర్మాణం ఆవశ్యకతను వివరించారు. గతంలో ఆరామ క్షేత్రం కోసం స్థలం కేటాయించడం జరిగిందని, కేటాయించిన అదే స్థలంలో నిర్మాణ పనులు చేపట్టి విశ్వబ్రాహ్మణ సమాజానికి అందుబాటులోకి తీసుకురావాలని వారు ఎమ్మెల్యేను కోరారు. అద్దె ఇళ్లలో నివసిస్తూ, సొంత ఇళ్లు లేని విశ్వబ్రాహ్మణ కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందిన సందర్భంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సొంత ఇల్లు లేని కుటుంబాల్లో మరణం సంభవించినప్పుడు మృతదేహాన్ని ఇంట్లో ఉంచేందుకు ఇంటి యజమానులు అంగీకరించకపోవడంతో, మృతదేహాన్ని ఆరామ క్షేత్రానికి తరలించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. అయితే ప్రస్తుతం సరైన ఆరామ క్షేత్రం లేకపోవడంతో ఆయా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, అదేవిధంగా మరణానంతరం నిర్వహించాల్సిన దశదినకర్మ తదితర కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు కూడా సరైన వసతి లేక కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆరామ క్షేత్రం నిర్మాణం పూర్తయితే మృతదేహాన్ని ఉంచేందుకు, దశదినకర్మ కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రత్యేక వసతి అందుబాటులోకి వస్తుందని, ముఖ్యంగా అద్దె ఇళ్లలో నివసించే నిరుపేద మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వారు పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు అందించిన వినతిపత్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సానుకూలంగా స్పందించారు. ఆరామ క్షేత్రం నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గతంలో కేటాయించిన స్థలంలో నిర్మాణం చేపట్టే అంశంపై సంబంధిత అధికారులతో చర్చించి, అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. విశ్వబ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి సంక్షేమానికి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆరామ క్షేత్రం నిర్మాణానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడంపై విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను అర్థం చేసుకుని, కేటాయించిన స్థలంలో ఆరామ క్షేత్రం నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, ప్రసాద్, సుధా కొండలరావు రమేష్ రాజేశ్వర చారి తదితర విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏరియా వైద్యశాలకు రూ.55 వేల విలువైన వైద్య పరికరాల అందించిన పివిఆర్



**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 6**

కందుకూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు, సూర్య రెస్టారెంట్ అండ్ బార్ అధినేత పిడికిటి వెంకటేశ్వర్లు తన వంతు సహకారం అందించారు. ఆసుపత్రిలో రోగులు కూర్చునేందుకు అవసరమైన బెంచీలు, ఐవీ స్టాండ్లు, నెబ్యులైజర్లు తదితర వైద్య అవసరాల కోసం సుమారు రూ.55 వేల విలువైన సామగ్రిని పిడికిటి వెంకటేశ్వర్లు అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన సామగ్రిని అందించి సేవాభావాన్ని చాటుకున్న పిడికిటి వెంకటేశ్వర్లును కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అభినందించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు దాతలు, ప్రజా ప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కందుకూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇంద్రాణి, పిడికిటి వెంకటేశ్వర్లుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఆసుపత్రి అవసరాలను గుర్తించి విలువైన సామగ్రిని అందించడం పట్ల ఆమె కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు తమకు తోచిన విధంగా సహకరించాలని ఈ సందర్భంగా పలువురు కోరారు.

# పశుగ్రాసం కోసం వందల మైళ్ళు నడిచి వస్తున్న జీవాలు

## 1,500 గొర్రెలతో నాలుగు కుటుంబాల జీవాలు సంచారం

**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 06**

వర్షా భావపరిస్థిలు నెలకొని జీవాలకు మేతలేక పశుగ్రాసం కోసం కర్ణాటక నుంచి నాలుగు కుటుంబాలు సుమారు 2వేల గొర్రెలను వెంట తీసుకుని సుదీర్ఘ కాలినడకన గిద్దలూరుకు చేరుకున్నారు. గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్న తమ. ప్రాంతంలో వర్షాలు లేకపోవడం వల్ల తీవ్రమైన పశుగ్రాసం కొరత ఏర్పడటంతో గొర్రెలను తీసుకుని ఇతర ప్రాంతాలకు తరలివస్తున్నామని జీవాల యజమానులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని బేలెఘంజిల్లా చిక్కోడి తాలూకా పరిసర ప్రాంతాలు మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలో ఉంటాయని, ఇటీవల అక్కడ వర్షాలు లేకపోవడంతో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఏర్పడిందని చెప్పారు. దీంతో తమ స్వగ్రామం నుంచి గొర్రెలను వెంట తీసుకుని సుదీర్ఘ కాలినడకన బయలుదేరి గ్రాసం ఉన్నచోట జీవాలను మేపుకుంటు వస్తున్నామని వారు వివరించారు. నంద్యాల, కర్నూలు ప్రాంతాల్లో కూడా గొర్రెలను మేపుకుంటూ గిద్దలూరు వైపు వచ్చినట్లు చెప్పారు. రోజుకు సుమారు 15నుంచి 20 కిలోమీటర్ల మేర గొర్రెలను కాలినడకన తీసుకొని ఎక్కడ పశుగ్రాసం నీరు ఉంటే అక్కడ గుడారాలు వేసుకొని ఉంటామని . ఇటీవల గాజులపల్లి నుంచి గిద్దలూరుకు సుమారు 30 కిలోమీటర్లు గొర్రెలతో కలిసి కాలినడకన ప్రయాణించి చేరుకున్నట్లు తెలిపారు . నాలుగు కుటుంబాలకు కలిపి దాదాపు 2వేల జీవాలు ఉన్నాయని, వీటిలో చిన్న గొర్రె పిల్లలు కూడా ఉన్నాయని తెలిపారు. గొర్రె పిల్లలు ఎక్కువ దూరం నడవలేకపోవడంతో వాటిని అవసరమైన సందర్భాల్లో వాహనాల్లో తరలిస్తున్నామన్నారు . ప్రయాణ సమయంలో తమకు అవసరమైన సామగ్రిని కూడా రవాణా మార్గంలో తీసుకువెళ్తున్నామన్నారు. ప్రస్తుతం



గిద్దలూరు పరిసర ప్రాంతంలో గుడారాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నామని, ప్రతిరోజూ గొర్రెలను మేత కోసం పరిసర ప్రాంతాలకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో అవసరాన్ని బట్టి గొర్రెల క్రయవిక్రయాలు కూడా చేస్తుంటామని తెలిపారు. గిద్దలూరు ప్రాంతంలో కొంతకాలం మేత అందించిన అనంతరం మార్కాపురం, వినుకొండ ప్రాంతాల వైపు గొర్రెలను మేపుకుంటూ కాలినడకన వెళ్లనున్నట్లు చెప్పారు. అక్కడ కూడా కొంతకాలం సంచరించిన అనంతరం తిరిగి తమ సొంత ప్రాంతానికి గొర్రెలను వెంట తీసుకుని కాలినడకననే తిరిగి వెళ్తామన్నారు. పశుగ్రాసం కోసం ఇలా సుదూరం గొర్రెలతో కలిసి కాలినడకన ప్రయాణిస్తూ జీవనం సాగించడం తమకు ఏళ్లుగా కొనసాగుతున్న జీవన విధానమని, ప్రస్తుతం పశుగ్రాసం కొరత కారణంగా ఇతర ప్రాంతాలకు రావాల్సి వస్తోందని గొర్రెల యజమానులు తెలిపారు.

# విద్యారంగంలో మరోసారి పీఈసీ సత్తా

**- ఇద్దరు అధ్యాపకులకు ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి అవార్డులు**




**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 6**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి) అధ్యాపకులు రెండు ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి అవార్డులు అందుకొని కళాశాల ఖ్యాతిని మరో మెట్టు ఎక్కించారు. కళాశాల ప్రొఫెసర్ డా. కురపాటి సుబ్బారెడ్డి హైదరాబాద్‌లోని నరసింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల నిర్వహించిన ఆచార్య రత్న అవార్డ్స్--2026 లో "స్టేట్ లెవల్ బెస్ట్ టీచర్ అవార్డు" అందుకొని తన విశిష్ట బోధనా సేవలకు రాష్ట్రస్థాయి గుర్తింపు పొందారు. అలాగే, కంప్యూటర్ సైన్స్ విభాగ ప్రొఫెసర్ డా. ముప్పా లక్ష్మణరావు ట్రేతాయుగ్ ఫౌండేషన్ ప్రదానం చేసిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ విజనరీ మెంటర్ అవార్డు -- సీజన్-×× 2026 ను అందుకొని ఉత్తమ మార్గదర్శకుడిగా ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, అధ్యాపకులకు లభించిన ఈ రాష్ట్రస్థాయి పురస్కారాలు ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల విద్యా నాణ్యతకు నిదర్శనమని, విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేస్తున్న అధ్యాపకులకు ఇది దక్కిన సముచిత గౌరవమని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సి.హెచ్. రవి కుమార్ మాట్లాడుతూ, అధ్యాపకుల కృషి, నిబద్ధతకు లభించిన ఈ గుర్తింపు కళాశాలకు గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్‌లు, అన్ని విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అవార్డు గ్రహీతలను ఘనంగా అభినందించి, వారి సేవలు మరెందరికో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

# 11 న ఒంగోలులో ఆయుర్వేద అవగాహనా సదస్సు.. ఉచిత వైద్య శిబిరం

## - ఆయుష్ శాఖ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం భ్రమరాంబ వెల్లడి







**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ సెప్టెంబర్ 06**
ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు స్థానిక కేశవ స్వామి పేటలోని శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలోని బి ఎం ఆర్ కళ్యాణ మండపంలో ఆయుర్వేద అవగాహనా సదస్సు, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయుష్ శాఖ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం భ్రమరాంబ వెల్లడించారు. ఆదివారం స్థానిక సీతారాంపురంలోని శ్రీ వాసవి విద్యానిధి ఆర్యవైశ్య బాలుర వసతి గృహంలో ఏర్పాటైన ఆయుర్వేద అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆయుష్ శాఖ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ , ఆయుష్ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శేఖర్ రాజుల ఆదేశాలతో ఆయుర్వేద అవగాహనా సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. మధుమేహం, బిపి, థైరాయిడ్, గ్యాస్ ట్రబుల్ తో పాటు పలు ఆరోగ్య సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించడంతో పాటు అవసరమైన మందులను రోగులకు ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఆయుర్వేద వైద్య విధానం పట్ల ప్రజలలో మరింత నమ్మకాన్ని పెంపొందించేందుకు ఆయుర్వేద వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఇంటింటికి ఆయుర్వేదం పేరిట త్వరలోనే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆమె వెల్లడించారు. భారతదేశంలో కొన్ని వేల సంవత్సరాలుగా ఆయుర్వేద వైద్యం మంచి ప్రాచుర్యాన్ని పొందిందని, రోగాలను అదుపు చేసి పరిపూర్ణ ఆరోగ్యంతో జీవించేలా చేసే వైద్య విధానం కావడం వల్ల ఆయుర్వేదం అనే పేరు వచ్చిందని తెలిపారు. ఈ నెల 11వ తేదీన జరిగే ఆయుర్వేద ఉచిత అవగాహనా సదస్సు, వైద్య శిబిరానికి హాజరయ్యే ప్రజలు పేర్ల నమోదు కోసం తమ ఆధార్ కార్డును, ఫోన్ ను తమ వెంట తీసుకురావాలని సూచించారు. ఒంగోలు తోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని తమ జీవన ప్రమాణాలను ఆయుర్వేద వైద్య విధానం ద్వారా మరింత మెరుగు పరుచుకోవాలని ఆమె కోరారు. భాగవత ప్రచార సేవాసమితి అధ్యక్షులు తెలుగు అధ్యాపకులు ఎంవీఎస్ శాస్త్రి మాట్లాడుతూ ఆయుర్వేదం మానవుని ఆయుష్షును పెంచే వైద్య విధానమని అందువల్లనే ఆ వైద్య విధానానికి ఆయుర్వేదం అనే పేరు వచ్చిందని పేర్కొన్నారు. దీర్ఘకాలిక రోగాలను కూడా నయం చేసే శక్తి ఆయుర్వేదానికి ఉందని ప్రజలు ఆయుర్వేద వైద్య విధానాన్ని అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఆయుర్వేద అవగాహన సదస్సు మరియు ఉచిత వైద్య శిబిరం తాలూకు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి విద్యానిధి ఆర్యవైశ్య బాలుర వసతిగృహం పాలకవర్గ కోశాధికారి నూనె రామాంజనేయులు, శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ అధ్యక్షులు జంధ్యం రాధా రమణ గుప్తా శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ సభ్యులు ధనిశెట్టి రాముసాయుడు పలువురు పాల్గొన్నారు.

## ఒంగోలు మస్తాన్ దర్గా వద్ద ట్రాఫిక్ కష్టాలకు చెక్



**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ సెప్టెంబర్ 06**
ఒంగోలులోని పాత కూరగాయల మార్కెట్ మస్తాన్ దర్గా వద్ద ట్రాఫిక్ కు అడ్డుగా ఉన్న డివైడర్లను ట్రాఫిక్ పోలీసు వారు క్రేన్ సహాయంతో వెడల్పు చేసారు. మస్తాన్ దర్గా వద్ద నుండి పాత కూరగాయల మార్కెట్ వరకు డివైడర్లతో ఇరుకుగా మారిన ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించి, వాహనచోదకులు ఇబ్బందులు పడకుండా ట్రాఫిక్ పోలీసులు తీసుకున్న ఈ నిర్ణయానికి ప్రజలు, వాహన యజమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ సిహెచ్ హజరతయ్య, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

## గురిజేపల్లి గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరం

### ఎస్ ఆర్ కుమార్ సహకారంతో ఇంపీరియల్ గ్రానైట్స్- గౌతమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ

### పాల్గొన్న ఏషియన్ హాస్పిటల్స్ వైద్య బృందం






**సంతమాగులూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 06**
సంతమాగులూరు మండలం గురిజేపల్లి గ్రామంలో ఆదివారం ఇంపిరియల్ గ్రానైట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు గౌతమీ ఫౌండేషన్ నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చిందని యాజమాన్యం తెలిపారు. ఎస్ ఆర్ కుమార్ సహకారం తో ఈ వైద్య శిబిరం నిర్వహించటం సంతోషం గా ఉంది అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యం పట్ల ఇంపిరియల్ గ్రానైట్స్ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని యాజమాన్యం తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో ఏషియన్ హాస్పిటల్స్ వారి వైద్య బృందం పాల్గొని ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏషియన్ హాస్పిటల్ డాక్టర్ వంశీనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి వైద్య శిబిరలు నిర్వహించి ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న గౌతమీ ఫౌండేషన్ వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉచిత రక్త పరీక్షలు, బీపీ పరీక్షలు, నిర్వహించారు. సర్వ నేత్రాలయ రేటినా మరియు కంటి వైద్య నిపుణులు పాల్గొని ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులను మరియు అవసరమైన వారికి కళ్ల అద్దాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో గురిజేపల్లి, చవిటిపాలెం, తంగేడుమల్లి గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వైద్య శిబిరం నిర్వహించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.


# క్వారీ స్థలం దురాక్రమణ..

### యజమాని గిరిరాజు నాగేశ్వరావు

### గత తహసీల్దార్ టి ప్రశాంతి పనిచేసిన కాలంలో నకిలీ రికార్డులు

### ప్రెస్ మీట్‌లో వివరాలను వెల్లడించిన వీరాంజనేయ గ్రానైట్ క్వారీ యజమాని


**సంతమాగులూరు పెన్ పవర్, సెప్టెంబర్ 06**
సంతమాగులూరు మండలంలోని గురిజేపల్లి గ్రామంలోని సర్వే నెం 109/1 లోని య. 5.45సెంట్లు ఆస్తిని దురాక్రమణ చేశారని వీరాంజనేయ గ్రానైట్ క్వారీ యజమాని గిరిరాజు నాగేశ్వరరావు ఆదివారం మీడియాతో తెలిపారు. గురిజేపల్లిలోని సౌదామిని గ్రానైట్స్ వాళ్లు నకిలీ స్వాధీనపు అగ్రిమెంట్లు సృష్టించి, గతంలో సంతమాగులూరులో తహశీల్దార్ గా చేసి ప్రస్తుతం మార్టూరులో తహశీల్దార్ గా విధులు నిర్వర్తిస్తున్న టి. ప్రశాంతి అండదండలతో నకిలీ రికార్డులు సృష్టించి, తప్పుడు రిజిస్ట్రేషన్ కూడా చేయించారని తెలిపారు. వాటి ద్వారా కోర్టులో దావా దాఖలు చేసి, సదరు భూమి సౌదామిని గ్రానైట్స్ వారిదే అని బోర్డులు పెట్టి, వాహనాలు అడ్డుగా పెట్టారు. వీరాంజనేయ గ్రానైట్ క్వారీలో నిలిపిన సౌదామిని గ్రానైట్ క్వారీ వాహనాలను వెళ్లకుండా కట్టుదిట్టం చేశారు. ప్రస్తుతం సదరు సర్వేనెంబర్ 109/1 లో



గిరి రాజు నాగేశ్వరరావు పేరు మీదనే ఆన్లైన్లో చూపిస్తుందని కూడా తెలిపియున్నారు. ఇలా నకిలీవి సృష్టించి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని సంతమాగులూరు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు వచ్చి సౌదామిని గ్రానైట్స్ వాహనాలను పంపించమని ఆదేశాలు చేసి వాళ్లకు సపోర్టుగా మాట్లాడినట్లు పేర్కొన్నారు. సంబంధిత నకిలీ పత్రాల ఆధారాలు తన దగ్గర ఉన్నాయని, ప్రభుత్వం వారు, పోలీసులు విచారణ జరిపి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. నకిలీ పత్రాలు సృష్టించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన కోరారు. మండల మేజిస్ట్రేట్ హోదాలో ఉండి ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ఆయన ఆవేదం వ్యక్తం చేశారు. మీడియా ద్వారా ప్రజలకు, ప్రభుత్వానికి తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రెస్ మీట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## తాగునీటి చెరువులపై సీపీఐ బృందం పర్యటన

**సంతమాగులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 06**
మండలం పరిధిలోని ఏల్చూరు, కొమ్మాలపాడులో ఉన్న మంచినీటి చెరువులను సీపీఐ బృందం ఆదివారం పరిశీలించారు. ఇటీవల విడుదలైన సాగర్ జలాలతో మంచినీటి చెరువులను నింపాల్సింది. ఈసందర్బంగా సంతమాగులూరు మండల సీపీఐ నేతలు ఆధ్వర్యంలో ఎంతమేర నీరు చెరువులకు సరఫరా అవుతుందని తెలుసుకునేందుకు కాలువలపై పర్యటించారు. కాలువల్లో ప్రవహిస్తున్న నీటి ప్రవాహానికి చెరువులకు చేరుతున్న నీరు చాలా తక్కువగా ఉందని ఆ పార్టీ మండల కార్యదర్శి షేక్. ఖాదర్ బాషా, సహాయ కార్యదర్శి మేకల రమణయ్య ఆరోపించారు. ఇలా తక్కువగా నీటితో ఎన్ని రోజులకు చెరువులు నింపగలరని, ఆ నీటితో సమ్మర్ స్టోరేజ్ ల ద్వారా ప్రజలకు తాగునీరు ఎప్పుడు విడుదల చేయగలరని ప్రశ్నించారు. ఇప్పటికే జిల్లాలోకి సాగర్ జలాలు ప్రవేశించి నాలుగైదు రోజులు అవుతుంది. ఇంకా ఎన్నిరోజులు సరఫరా చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత



శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, సాగర్ జలాలు సక్రమంగా మంచినీటి చెరువులకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మార్కాపురం జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్ కార్యవర్గము ఏకగ్రీవము

### అధ్యక్షులుగా డాక్టర్ జి.కె. మోహన్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా జి. అల్లు సత్యనారాయణ

**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 06**
స్థానిక టెన్నిస్ ప్రాంగణం నందు మార్కాపురం జిల్లాలోని గిద్దలూరు ,కనిగిరి, మార్కాపురం ప్రాంతాలకు చెందినటెన్నిస్ క్రీడాకారుల సర్వసభ్య సమావేశము ఏర్పాటు చేయబడినది ఈ సమావేశంలో జిల్లా టెన్నిస్ కార్యవర్గము ఏకగ్రీవంగా ఎన్నుకోబడినది మార్కాపురం జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులుగా గిద్దలూరుకు చెందిన డాక్టర్.జి.కె.మోహన్ రెడ్డి , ప్రధాన కార్యదర్శిగా కనిగిరికి చెందిన జి.అల్లు సత్యనారాయణ, కోశాధికారిగా మార్కాపురానికి చెందిన ఐ. అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా సిహెచ్.మోహన్ రావు, కె.మనోహర్ రెడ్డి, కార్య నిర్వహణ కార్యదర్శిగా ఎస్.కె.టి. వలి, ఉప కార్యదర్శులుగా షేక్. ఇబ్రహీం, వి.చంద్రశేఖర్, గౌరవ సలహాదారులుగా షేక్.అబ్దుల్ గఫార్, జి.వి. రాఘవులు, టి.కునాల్, కార్యవర్గ సభ్యులుగా



ఎం.వి.ఎస్. రమేష్, షేక్.షబ్బీర్, వై.రామకోటేశ్వరరావు, యు. మహేష్ కుమార్, ఎస్. ప్రదీప్ రెడ్డి, షేక్.అబ్దుల్లా, ఎం. పృథ్వీ రెడ్డి, ఎం.ప్రసాద్, పి.చంద్రశేఖర్, ఎస్.విజయ్ కుమార్, షేక్.సమైర్ , టెన్నిస్ అసోసియేషన్ కోచ్ గా సిహెచ్. మురళీమోహన్ రెడ్డి, అసోసియేషన్ వైద్య నిపుణులుగా డాక్టర్. ఎన్.సందీప్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు డాక్టర్ జి. కె.మోహన్ రెడ్డి మాట్లాడుతూ కార్యవర్గ సభ్యులందరూ టెన్నిస్ క్రీడను అభివృద్ధి పరచుట కొరకు, జిల్లాస్థాయి ,రాష్ట్రస్థాయి టోర్నమెంటులను నిర్వహించుట కొరకు అదేవిధంగా స్థానిక టెన్నిస్ ప్రాంగణంలనందు టెన్నిస్ కోచింగ్ క్యాంపులు నిర్వహించుట కొరకు కృషి చేస్తామని అన్నారు ఈ సమావేశంలో గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం ప్రాంతాలకు చెందిన టెన్నిస్ క్రీడాకారులు పాల్గొన్నారు.


## క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి

### జలగం వరుణ్ కుమార్



**గుడ్లూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 06:**
క్షేత్రస్థాయిలో బీజేపీపార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల బీజేపీ అధ్యక్షులు జలగం వరుణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన గుడ్లూరులో బీజేపీ మండలస్థాయి సమావేశం అధ్యక్షులు జలగం వరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జరిగినది. ఈ సంధర్భంగా మండల బీజేపీ అధ్యక్షులు జలగం వరుణ్ కుమార్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల గురించి మరియు క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం గురించి చర్చించడం జరిగినదన్నారు. నేడు జరగబోయే జిల్లా కార్యవర్గ సమావేశం గురించి ప్రత్యేకంగా చర్చించి, ప్రతి సోమవారం జరిగే జనతా వారధి గురించి మన ఊరు- మన జెండా గురించి తెలియజేయడం జరిగినదన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ1 జొన్నాదుల సురేష్, ప్రధాన కార్యదర్శి మేకల నాగరాజు, మాజీ మండల అధ్యక్షులు ఇన్నమూరి ప్రమీల సుధాకర్, పార్టీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న స్పందన ఉపాధ్యాయులు




**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 6:**
మార్కాపురం జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా ఉత్తమ టీచర్ " 2026" కార్యక్రమంలో స్పందన విద్యాసంస్థలకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికై ఘనంగా సత్కారం అందుకున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ, వినూత్నమైన , ఉత్తమ బోధనా పద్ధతులను అవలంబిస్తూ, విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో విశేష కృషి చేస్తున్న స్పందన విద్యాసంస్థల ఉపాధ్యాయులు టి. అరుణ, యన్. రత్నకుమారి, పి. వెంకటేశ్వర్లుఈ ప్రతిష్టాత్మక అవార్డులకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులు, అప్పుస్మా రాష్ట్ర , జిల్లా ప్రతినిధుల చేతుల మీదుగా అవార్డు గ్రహీతలకు ప్రశంసాపత్రం, మెమెంటో, శాలువాలతో ఘనంగా సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పందన విద్యాసంస్థల యాజమాన్యం మాట్లాడుతూ, ఉపాధ్యాయుల కృషి, అంకితభావం, క్రమశిక్షణ , నిరంతర శ్రమకు లభించిన ఈ గుర్తింపు సంస్థకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఇటువంటి పురస్కారాలు ఉపాధ్యాయుల్లో మరింత బాధ్యతను పెంచడంతో పాటు, విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత నిబద్ధతతో పనిచేయడానికి స్ఫూర్తినిస్తాయని తెలిపారు. అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను స్పందన విద్యాసంస్థల యాజమాన్యం, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు అభినందించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న స్పందన విద్యాసంస్థల ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో వరుసగా లభిస్తున్న ఈ గుర్తింపులు సంస్థ విద్యా ప్రమాణాలకు మరోసారి నిదర్శనంగా నిలిచాయని విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నారాయణస్వామి ఆలయానికి ప్లేట్లు గ్లాసులు అందజేత



**సి ఎస్ పురం,పెన్ పవర్ సెప్టెంబర్ 6**
జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి దాతలు తమవంతు సహకారం గా హైదరాబాద్ వాస్తవ్యులు నారపరాజు గాండీవ ప్రసాద్ ధర్మపత్ని రాగ మల్లిక కుమారులు జస్విక్ రామ సాయి, జస్విన్ రామ సాయి మరియు మిత్రబృందం కలిసి 250 స్టీల్ ప్లేట్లు, 250 స్టీల్ గ్లాసులను దేవస్థాన కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ కు అందజేశారు ఈ సందర్భంగా ఈవో గిరిరాజు నరసింహబాబు మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఆలయానికి విచ్చేసే భక్తులకు నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని తగ్గించి పర్యావరణహితంగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు దాతలు స్టీలు ప్లేట్లు, స్టీల్ గ్లాసులు అందజేసినట్లు తెలిపారు అన్నదాన కార్యక్రమానికి స్టీల్ ప్లేట్లు, గ్లాసులను అందించదలచిన దాతలు ముందుగా దేవస్థాన కార్యాలయాన్ని సంప్రదించి అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలయ అన్నదాన కార్యక్రమానికి అవసరమైన సామగ్రిని అందజేసి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడిన నారపరాజు గాండీవ ప్రసాద్ కుటుంబ సభ్యులు, వారి మిత్రబృందాన్ని ఈఓ గిరిరాజు నరసింహబాబు అభినందించారు. భక్తుల సేవతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే కార్యక్రమాలకు దాతలు ముందుకు రావాలని ఆకాంక్షించారు.

# వర్షాల కోసం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



**సంతమాగులూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 6**

సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామంలో ఆదివారం వర్షాల కోసం గ్రామదేవతలకు, గౌడ్రాళ్ళకు గ్రామం మొత్తం తిరిగి జలాభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాదిగా భక్తులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని పోలేరమ్మ గుడి దగ్గర పొంగళ్ళు పెట్టారు. శ్రావణమాసం ఆదివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు హడావిడితో పోలేరమ్మ గుడి కితకితలు ఆడింది. ఇలాంటి కార్యక్రమం చేయడం ఎంతో ఆనందంగా ఉందని భక్తులు తెలిపారు. గతంలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితి రాలేదని ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో వర్షం ఎంతో అవసరమని స్థానికులు వాపోయారు.

# ఏపీ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది

## సాదినేని యామిని శర్మ





**మార్కాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 6**

భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు,రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ అన్నారు.మార్కాపురం జిల్లా కేంద్రంలోని నెహ్రూ బజార్ లోని షిరిడి సాయిబాబా ఫంక్షన్ హాల్ లో మార్కాపురం జిల్లా బీజేపీ అధ్యక్షులు పి.వి. కృష్ణారావు ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యామిని శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకొని అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని, ప్రతి ఒక్కరూ భాగస్వాములై కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు పార్టీ బలోపేతం కోసం కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా ఇన్చార్జ్ కొక్కెర శ్రీనివాస్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ విజయలక్ష్మి, మాజీ జిల్లా అధ్యక్షులు శిరసనగండ్ల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి తంగిరాల అశోక్ రెడ్డి, ప్రసాదు, స్టేట్ సోషల్ మీడియా కో కన్వీనర్ అభిలాష్, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 18వ బ్లాక్‌లో చెత్తతో నిండిన కాలువలు.. రోడ్డుపైకి మురికి నీరు





**మార్కాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 6**

మార్కాపురం పురపాలక సంఘం పరిధిలోని 18వ బ్లాక్‌లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. కొన్ని వారాలుగా కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని మున్సిపాలిటీ సిబ్బంది తొలగించకపోవడంతో కాలువలు పూడుకుపోయాయి. దీంతో మురికి నీరు రోడ్డుపైకి వచ్చి దుర్వాసన వెదజల్లుతోంది. కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లతో కాలువ పూర్తిగా మూసుకుపోయింది. ఈ మురికి నీరు నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయని, రాత్రి వేళల్లో బయటకు రావాలంటేనే భయంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. వెంటనే మున్సిపాలిటీ అధికారులు స్పందించి కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, దోమల నివారణ చర్యలు చేపట్టాలని 18వ బ్లాక్ వాసులు కోరుతున్నారు.

# కమ్మవారి సేవా సంఘం సామాజిక సేవలు అభినందనీయం

## – ఏపీ టెక్నాలజీ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ – ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం అధ్యక్షులు మండవ మురళీకృష్ణ సేవలకు సర్వత్ర ప్రశంసలు

**ఒంగోలు టౌన్, పెన్ పవర్ సెప్టెంబర్ 06**

అక్షర దానం కన్నా గొప్ప దానం మరొకటి ఉండదని, కమ్మ సామాజిక వర్గం లోని పేద విద్యార్థులకే కాకుండా ఇతర సామాజిక వర్గాల్లోని పేద విద్యార్థులకు ఆర్థిక సాయంతో పాటు ల్యాప్టాప్ లు బహుకరించటం గొప్ప కార్యక్రమం అని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ సంస్థ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ అన్నారు. ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం ఆధ్వర్యంలో ఒంగోలు బైపాస్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ హాల్లో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆర్థిక సహాయంతో పాటు లాప్ ట్యాపు లు పంపిణీ చేసే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మీడియా,సోషల్ మీడియాలో ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం చేస్తున్న అనేక బృహత్తర కార్యక్రమాలు తనని ఎంతో ఇన్స్పైర్ చేసిందని అన్నారు. కోటి రూపాయలకు పైగా పేద విద్యార్థులకు సహాయం చేయడం అంటే మామూలు విషయం కాదని అన్నారు. ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం అధ్యక్షులు మండవ మురళీకృష్ణ కాలికి బలపం కట్టుకొనిమరీ కమ్మ సామాజిక వర్గంలోని పెద్దలను కలిసి ఈ సేవా కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా జరుపుతుండడం,వారికి అండగా నిలుస్తున్న సంఘ కార్యవర్గాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలియజేశారు. కమ్మవారి సేవా సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాలలో తాను కూడా భాగస్వామిని అవుతానని ,నా వైపు నుండి ఆర్థిక సాయం ఎంతైనా ఇస్తానని ఆయన భరోసా ఇచ్చారు. వన్ కే డోనర్స్ క్లబ్ అనే కాన్సెప్ట్ గొప్పదని పేర్కొన్నారు.



ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం అధ్యక్షులు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన ఈ సేవా కార్యక్రమాలు పేద విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపుతాయని ఆశిస్తున్నామని తెలియజేశారు. ఎంతోమంది డోనర్స్ కార్యక్రమానికి స్పందించి సహాయం చేస్తున్నారని వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, సాయం పొందిన వారు భవిష్యత్తులో అభివృద్ధి చెంది ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించాలని, ఈ సేవా యజ్ఞాన్ని ముందుకు తీసుకువెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి ఎన్నారై వింగ్ ఆస్ట్రేలియా అధ్యక్షులు ఎనికపాటి వెంకటేష్,నూజివీడు సీడ్స్ గ్రూప్ జనరల్ మేనేజర్ చింతమనేని ఏసుదాసు, ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం ఫౌండర్ చైర్మన్ డాక్టర్



కామేపల్లి సీతారామయ్య,ప్రధాన కార్యదర్శి ఆలా హనుమంతరావు, కోశాధికారి మందాడి రాఘవరావు, వన్ కే డోనర్స్ క్లబ్ చైర్మన్ పాటిబండ్ల వెంకటేశ్వర్లు, పావులూరి పద్మజ, గోగినేని శ్రీనివాసరావు, కాట్రగడ్డ రఘుపతిరావు, వడ్డంపూడి సుజాత రావు, బొడ్డపాటి వెంకట్, మోటుపల్లి వెంకటేశ్వర్లు చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఇరవై మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎనిమిది లక్షల ఆర్థిక సహాయంతో కూడిన చెక్కులు, సుమారు 27 లక్షల రూపాయల విలువచేసే 43 ల్యాప్టాప్ లను 43 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి సంధాన కర్తగా ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం సభ్యులు మండవ సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కమ్మవారి సేవా సంఘం సభ్యులు వన్ కే డోనర్స్ నెంబర్లు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నారాయణ స్వామికి పూజలు

## పూజా కార్యక్రమంలో పాల్గొన్న పాములపాటి మాధవ ప్రసాద్



**సి ఎస్ పురం,పెన్ పవర్ సెప్టెంబర్ 6**


జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఆలయ దేవస్థాన కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో ఆలయ వేద పండితులు మంకాల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు



శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఆలయ ప్రాంగణంలోని గోశాలలో ప్రత్యేకంగా గోపూజ నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి మహా నైవేద్యాన్ని సమర్పించారు. మేళతాళాల నడుమ సంప్రదాయబద్ధంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆదివారం కావడంతో ఉదయం నుంచే ఆలయం వద్ద భక్తుల రాకపోకలు పెరిగాయి. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు మరియు నారాయణస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ పాములపాటి మాధవ ప్రసాద్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమాలలో నారాయణస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ పాములపాటి మాధవ ప్రసాద్, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

# డి జి పేటలో 45 వ ఉచిత వైద్య శిబిరం

## గ్రామీణుల ఆరోగ్యానికి డాక్టర్ మల్లికార్జున రెడ్డి చేయూత -అభినందించిన గ్రామస్తులు




**సి ఎస్ పురం,పెన్ పవర్ సెప్టెంబర్ 6**

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలుఅందించాలనే లక్ష్యంతో మల్లికార్జునరెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని డి జి పేట గ్రామంలో ఆదివారం 45వ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జునరెడ్డి స్వయంగా వైద్య పరీక్షలు నిర్వహించి, రోగుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. అవసరమైన వారికి ఆరోగ్యంపై సలహాలు, సూచనలు అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ వైద్య శిబిరంలో 300 మందికి వైద్య సేవలు అందించామని, వివిధ ప్రాంతాల్లో 45 ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వీలైనంత మేరకు




ఉచితంగా వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు. ప్రజలు ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు డాక్టర్ మల్లికార్జున రెడ్డిని అభినందించిన గ్రామస్తులు గ్రామీణ ప్రాంతాలలో ఆర్థిక భారం లేకుండా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తున్న డాక్టర్ మల్లికార్జున రెడ్డి సేవలు అభినందనీయమన్నారు డాక్టర్ మల్లికార్జున రెడ్డి వైద్యాన్ని వృత్తిగా కాకుండా సేవా కార్యక్రమం గా భావించి మారుమూల గ్రామాలకు వైద్య శిబిరాలు నిర్వహించి సేవలు అందిస్తున్నారని కొనియాడారు ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జున రెడ్డిని ఆర్ఎంపీ డాక్టర్ కేశవరావు, మ్యాథ్స్ అసిస్టెంట్ జి వెంకటేశ్వర్లు, గ్రామస్తులు శాలువా తో సన్మానించి ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని గ్రామాల్లో కొనసాగాలని ఆకాంక్షించారు.

# సాధినేని యామిని శర్మ ను మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి నాయకులు


**సి ఎస్ పురం,పెన్ పవర్ సెప్టెంబర్ 6**

జిల్లా కార్యవర్గ సమావేశం నకు మార్కాపురం లో ఆదివారం సాయిబాబా కళ్యాణ మండపం నందు ప్రధాని నరేంద్ర మోడీ 25ఏళ్ళ ప్రజా సేవ, 75వ జన్మదినోత్సవ సందర్భంగా మరియు సెప్టెంబర్ 17 – అక్టోబర్ 17 వరకు నిర్వహించనున్న సేవాసంకల్ప అభియాన్ జిల్లా కార్యశాల మరియు జిల్లా కార్యవర్గ సమావేశం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జాతీయ కౌన్సిల్ సభ్యులు ఛ బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామిని శర్మ ను మండల బిజెపి ఇన్చార్జి కొండిశెట్టి వెంకట



రమణయ్య మరియు బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు ఈ కార్యక్రమంలో మండల బిజెపి ఇంచార్జ్ కొండిశెట్టి వెంకటరమణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇండ్ల వెంకట సత్యం, మండల బిజెపి అధ్యక్షుడు పాశం రామకృష్ణ, సాధు కాశీ రావు,ఇండ్ల సూర్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు జాజం చిన్న సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎగువపల్లిలో కళ్యాణ మహోత్సవ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న దద్దాల





**సి ఎస్ పురం,పెన్ పవర్ సెప్టెంబర్ 6**

మండలంలోని పెద్ద రాజుపాలెం పరిధిలోగల ఎగువపల్లి గ్రామంలో కొలువైయున్న సీతారాముల కళ్యాణ మహోత్సవ వార్షికోత్సవ వేడుకలలో మండల వైఎస్ఆర్సిపి శ్రేణులతో కలిసి ఆదివారం కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు అనంతరం వేదపండితులు వేద ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ సీతారామచంద్ర స్వామి దివ్య ఆశీస్సులతో నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ,ఆ భగవంతుని కృప అందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. పూజ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు పాలుగుళ్ళ మల్లికార్జున్ రెడ్డి, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, జిల్లా వైఎస్ఆర్సిపి ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు మితికేల గురువయ్య, వైయస్సార్సీపి నాయకులు మొరార్జీ, అటేలయ్య పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖులను కలిసిన బోయిన రాయుడు



**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 6**

ఆల్ ఇండియా తెలగ, బలిజ, కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చెన్నై పట్టణంలోని జీఆర్టీ ఫైవ్ స్టార్ హోటల్లో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన బిజెపి ఎంపీ లక్ష్మణ్, జనసేన పీఏసీ సభ్యులు హరిప్రసాద్ ను మండల కాపు నాయకుడు బోయిన రాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోయిన రాయుడు మాట్లాడుతూ కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యాపార పరిస్థితులు, మార్కెట్లో వస్తున్న మార్పులు, వ్యాపార రంగంలో ఉన్న అవకాశాలు తదితర అంశాలపై ప్రముఖులతో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు.

# నేడు భాగ్యనగర్ లో విద్యుత్ అంతరాయం

**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ సెప్టెంబర్ 06**

విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆర్డీఎస్ఎస్ కొత్త టవర్ల నిర్మాణం కారణంగా సోమవారం భాగ్యనగర్ 2 వ లైన్ పార్క్ వరకు , 3 వ లైన్ పార్క్ వరకు, పరిసర ప్రాంతంలో ఉదయం 08.30 గం. నుండి 9.30 గంటల వరకు, మధ్యాహ్నం 11.30 నుండి 12.30 గం. వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డి.ఈ.ఈ కె.వి. పాండురంగా రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# సి.సి. కెమెరాల ఏర్పాటు అభినందనీయం


## - ఒంగోలు డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు

**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ సెప్టెంబర్ 06**

దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ను ఏర్పాటు చేసుకోవాలని ఒంగోలు డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం నగర పరిధిలోని 2వ డివిజన్ ముక్తినూతలపాడులో పూర్వపు విద్యార్థులు 4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను డిఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్తినూతలపాడు గ్రామంలో పూర్వపు విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. దొంగతనాలు అనేవి అనేక రకాలుగా ఉంటాయని కానీ గతంలో మన ప్రాంతంలో వాళ్లు దొంగతనాలు పాల్పడే వారిని గుర్తించి షీట్ ఓపెన్ చేసే వాళ్ళమని ప్రస్తుత పరిస్థితుల్లో బీహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అలాంటి వారిని గుర్తించటం చాలా కష్టంగా ఉంటుందని అందుకోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే సులభతరంగా నేరస్తులను గుర్తించడానికి అవకాశం ఉంటుందన్నారు. ముక్తినూతలపాడులో అందరూ ఐక్యంగా ఉండి 21 సీసీ కెమెరాలు బిగించుకొని నేరాల నియంత్రణ కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. నేరాలు జరిగిన తర్వాత కంటే నేరాలు జరగకముందే అరికట్టేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. టెక్నాలజీని అంది పుచ్చుకునే దానికోసం రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక దిశగా కృషి చేస్తుందని తెలిపారు. ఒంగోలు మాజీ ఏఎంసి చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్




నాయకత్వంలో కిమ్స్ ఆస్పత్రి నుంచి ముక్తినూతలపాడు కు రావడానికి




సాగర్ కెనాల్ పై డబుల్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని మూడో వారంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం చేపట్టబోతున్నామని తెలిపారు. పూర్వపు విద్యార్థులు సూదనగుంట శ్రీధర్ వారి మిత్ర బృందాన్ని డిఎస్పీ.. గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో బి.అశోక్, తేలపల్లి గాంధీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీజేపీ 'సేవాసంకల్ప' విజయవంతం చేయాలి

**సంతమాగులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 06**



ఏల్చూరులో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా మండల అధ్యక్షులు దేవరపల్లి నరసింహారెడ్డి, ప్రధానకార్యదర్శి సిరిపురపు వెంకటరెడ్డి మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ పూర్తి చేసుకోవడం, అదే సమయంలో ఆయన 75వ జన్మదినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ శుభతరుణంలో ఈనెల 17 నుంచి అక్టోబర్ 17 వరకు తలపెట్టిన సేవాసంకల్ప అభియాన్ ను విజయవంతం చేయాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## వెలుగొండ ప్రాజెక్టును సందర్శించిన టిడిపి నాయకులు

**సీఎస్పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 6**

మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన గ్రామ టిడిపి అధ్యక్షులు ఇసుకపల్లి తిరుపతయ్య, పులి రాజశేఖర్, పాఠశాల చైర్మన్ కత్తులపల్లి మౌలాలి రెడ్డి ఆదివారం పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇసుకపల్లి తిరుపతయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించి పనులను చేపట్టి ప్రారంభించడం అభినందనీయమన్నారు. కరువు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందడంతో రైతులు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.



## హెల్మెట్ శిరోభారం కాదు -ట్రాఫిక్ సిఐ హజరత్తయ్య





**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ సెప్టెంబర్ 06**

హెల్మెట్ శిరోభారం కాదు శిరోధార్యంఅని, మన ప్రాణ రక్షణ అని ట్రాఫిక్ సిఐ హజరత్తయ్య అన్నారు. ఆదివారం హెల్మెట్ ధారణపై వాహన చోదకులు కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రాణం మనకి మాత్రమే సొంతం కాదని మన కుటుంబానికి ఆధారమని పేర్కొన్నారు. హెల్మెట్ ఉంటే మనం ఉన్నట్లేనని, హెల్మెట్ ఒక వస్తువు కాదు మన జీవితంలో ఒక భాగమని గుర్తు చేశారు. ప్రయాణించేటప్పుడు మన బండిలో పెట్రోల్ ఉండాలి,మన తలకి తప్పక హెల్మెట్ ఉండాలని సూచించారు. హెల్మిట్ ధరించండి, ప్రాణాలను కాపాడుకోవాలని,సురక్షితంగా మీ గమ్యస్తానాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

## జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన రాష్ట్ర చైర్మన్ కోటేశ్వరరావు





**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ సెప్టెంబర్ 06**

ఒంగోలులోని కేంద్ర గ్రంథాలయాన్ని ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయం ఒంగోలులో పోటీ పరీక్షలుకు చదువుకునే పాఠకులతో మాట్లాడారు. అవసరమైన సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. కావలసిన పుస్తకాలను, అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థినీ విద్యార్థులతో డీఎస్సీ పరీక్షల గురించి మాట్లాడుతూ ముందు ముందు మంచి ఉద్యోగ అవకాశాలు కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. గ్రంథాలయాన్ని మరింత ఆధునికంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్ది మోడల్ లైబ్రరీగా అభివృద్ధి చేస్తానని ఛైర్మన్ హామీ ఇచ్చారు. విద్యార్థులు, ఉద్యోగార్థులు, పాఠకులకు ఉపయోగపడే విధంగా గ్రంథాలయంలో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

# జగన్ స్థానిక ప్రచారం ?



స్థానిక సంస్థల ఎన్నికలను వైసీపీ ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ఈసారి ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా 2024 ఎన్నికల కంటే పెరిగిన తమ బలాన్ని చాటాలని అనుకుంటోంది. అంతే కాదు కూటమి రెండేళ్లకు పైగా సాగిన పాలనలో ప్రజా వ్యతిరేకత గణనీయంగా ఉందని వైసీపీ నమ్ముతోంది. దాంతో తమ పార్టీకి అనూహ్యమైన ఫలితాలు వస్తాయని కూడా ధీమా వ్యక్తం చేస్తోంది. అందుకే జగన్ కూడా మొత్తం 175 అసెంబ్లీ ఇంచార్జిలకు గట్టిగానే చెబుతున్నారు. ఎక్కడా ఏకగ్రీవాలు వద్దు అని కూడా స్పష్టం చేస్తున్నారు. వాతావరణం అనుకూలంగా ఉందని కూడా వారికి తెలియజేస్తూ సరైన వ్యూహాలతో అంతా కలిసి సమిష్టిగా పోరాడితే వైసీపీకి మంచి ఫలితాలు వస్తాయని కూడా అంటున్నారు.

**సీట్ల సర్దుబాటు మీదనే :**

కూటమిలో మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు అనుకున్నంత ఈజీ కాదని వైసీపీ భావిస్తోంది. అంతే కాకుండా లోకల్ బాడీ ఎన్నికలు కాబట్టి దిగువ స్థాయిలో నాయకులు తమకు బలం ఉందనుకుంటే పార్టీని పక్కన పెట్టి మరీ రెబెల్స్ గా పోటీ చేయవచ్చు అని అంటున్నారు. అలా కూటమిలో పార్టీలకు పనిచేయాలని పై స్థాయిలో ఎంత చెప్పినా దిగువకు వచ్చేసరికి అది అనుకున్నంతగా వర్కౌట్ కాకపోవచ్చు అని అంటున్నారు. మిత్రులకు ఎక్కువ సీట్లు ఇస్తే ఓట్ల బదిలీ జరగకపోగా రెబెల్స్ పెరుగుతారని అలాగని తక్కువ సీట్లే కూటమి ఐక్యంగా పోటీకి అవరోధంగా మారుతుందని కూడా వైసీపీలో చర్చ సాగుతోంది. ఏ విధంగా చూసినా 2024లో జరిగినంత కట్టుగా ఈసారి మూడు పార్టీల మధ్య ఓట్ల బదిలీ కానీ పోటీ కానీ జరిగే వీలు లేదన్నది వైసీపీ అంచనాగా ఉంది. దాంతో తమకు ఇక్కడే అడ్వాంటేజ్ ఉంటుందని కూడా లెక్క వేసుకుంటోంది.

**జగన్ దిగితేనే :**

అయితే వైసీపీకి ఎన్ని అంచనాలు ఉన్నా ఎంతలా క్యాడర్ ని లీడర్ ని యాక్టివ్ చేసి రంగంలోకి దించినా జగన్ కూడా కీలక సమయంలో జనంలోకి రాకపోతే పార్టీకి అది ఇబ్బందిగా మారుతుందని అంటున్నారు. ఎందుకంటే మేయర్ జెడ్పీలు అన్నవి కీలకంగా ఉంటాయి. జిల్లా నగరాలలో ముఖ్య కేంద్రాల రాజకీయాలను ఇవి ప్రభావితం చేస్తాయి. కాబట్టి ఇక్కడ ఎంతో కొంత సానుకూలత వైసీపీకి రావాలీ అంటే జగన్ ముఖ్యమైన చోట్ల అయినా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే బాగుంటుంది అన్న భావన అయితే పార్టీలో ఉంది. జగన్ మొత్తానికి మొత్తం తిరగకపోయినా కీలక జిల్లాలలో ముఖ్యమైన రీజియన్లలో సభలు పెడితే కనుక వైసీపీ విజయావకాశాలను విశేషంగా ప్రభావం చేస్తుందని విశ్లేషిస్తున్నారు.

**నిజంగా వస్తారా :**

అయితే జగన్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి నిజంగా వస్తారా అన్నది అయితే తెలియదనే అంటున్నారు. జగన్ 2021 ఎన్నికల్లో కూడా లోకల్ బాడీ ఎన్నికల్లో ప్రచారం చేయలేదు, అయితే అప్పట్లో పార్టీ అధికారంలో ఉంది అన్ని బలాలూ అనుకూలించాయని అంటున్నారు. ఇపుడు అలా కాదని వైసీపీకి ఈ ఎన్నికలు ఎంతో ముఖ్యమైనవి అని కూడా చెబుతున్నారు. అందువల్ల జగన్ వస్తేనే బాగుంటుంది అన్నది పార్టీలో నేతల మాటగా ఉంది అని ప్రచారం సాగుతోంది. రెండేళ్ళకు పైగా సాగిన కూటమి పాలన మీద జగన్ చేసే విమర్శలు ఆయన ప్రసంగాలు అయితే జనంలోకి బాగా వెళ్తాయని అంటున్నారు. అలా వైసీపీకి అనుకూలత ఏర్పడుతుందని భావిస్తున్నారు. మరి జగన్ ప్రచారానికి వస్తారా రారా అన్నది అపుడే తేలుతుందని అంటున్నారు.

# కూటమిలో పవన్ కృష్ణ సారథ్యం.. అక్కడ కీ రోల్...!

జనసేన పార్టీ

ఆంధ్రప్రదేశ్‌లో 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలను ఉమ్మడిగా ముందుకు తీసుకురావడంలోను, భారీ విజయం దక్కించుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలోనూ కీలక పాత్ర పోషించిన జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అత్యంత కీలక పాత్ర పోషించనున్నారన్నది కూటమిలో జరుగుతున్న చర్చ. గత అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన 100% విజయభేరి ఇచ్చిన ఉత్సాహంతో, కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నారు.

ఈ నేపథ్యంలో జనసేన పార్టీ స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. స్థానిక సమరంలో పవన్ కళ్యాణ్ కీలకం కావడానికి ప్రధాన కారణాలు చాలానే ఉన్నాయి. స్థానిక ఎన్నికలకు ఆయువు పట్టు వంటి.. గ్రామీణ అభివృద్ధి - పంచాయతీ రాజ్ పోర్ట్‌ఫోలియోపై ఆయన ప్రధానంగా దృష్టి పెట్టారు. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా ఉన్నారు. ఉపాధి హామీ నిధుల విడుదల, గ్రామాల్లో పనుల నిర్వహణ, ఇటీవల నిర్వహించిన చారిత్రాత్మక గ్రామ సభలు ఆయనకు గ్రామీణ ఓటర్లలో, ముఖ్యంగా తటస్థులలో భారీ క్రేజ్‌ను తెచ్చిపెట్టాయి.

కూటమి సమన్వయం విషయానికి వస్తే.. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమిగా ఈ ఎన్నికల్లోనూ కలిసి పోటీ చేసే అవకాశం ఉంది. సీట్ల సర్దుబాటు, క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య సమన్వయం కుదర్చడంలో పవన్ కళ్యాణ్ నిర్ణయాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మహిళలు, యువత మద్దతును కూడ గట్టడంలోనూ కీలక రోల్ పోషిస్తున్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలుపై దృష్టి పెట్టడం, పవన్ కళ్యాణ్ క్లీన్ పాలిటిక్స్ ఇమేజ్ మహిళా, యువ ఓటర్లను జనసేన వైపు ఆకర్షిస్తున్నాయి.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మొదటి స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో, క్షేత్రస్థాయిలో పట్టు నిలుపుకోవడానికి పవన్ కళ్యాణ్ వ్యూహాలు ఇటు జనసేన పార్టీకి అటు కూటమికి దిక్సూచిలా మారనున్నాయి. మొత్తంగా గత సార్వత్రిక ఎన్నికల సమయంలో అనుకూలంగా మారిన ఆయన వ్యూహాలు ఇప్పుడు కూడా సానుకూలంగానే మారనున్నాయని అంటున్నారు. ఈ పరిణామం కూటమికి మరింత బలం చేకూరుస్తుందని అంటున్నారు.

పెన్ పవర్ సోమవారం 7 సెప్టెంబర్ 2026

# వైభవ్ సూర్యవంశీపై తిలక్ వర్మ స్లెడ్జింగ్.. అర్ధశతకం చేజార్చుకున్న యువ సంచలనం.. ఫ్యాన్స్ ఫైర్!

- దులీప్ ట్రోఫీ ఫైనల్లో 15 ఏళ్ల వైభవ్‌పై తిలక్ వర్మ స్లెడ్జింగ్
- 44 పరుగుల వద్ద ఔటైన యువ సంచలనం సూర్యవంశీ
- తిలక్ తీరుపై సోషల్ మీడియాలో అభిమానుల అసంతృప్తి
- మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ మెరుపు అర్ధశతకం (72)



**హైదరాబాద్ పెన్ పవర్:** దులీప్ ట్రోఫీ ఫైనల్లో యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ మరోసారి తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. నేడు సౌత్ జోన్‌తో ప్రారంభమైన ఫైనల్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 44 పరుగులు చేసి అర్ధశతకానికి చేరువలో ఔటయ్యాడు. అయితే, అతను ఔటవడానికి ముందు సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మతో జరిగిన ఓ చిన్న సంఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తిలక్ వర్మ, వైభవ్‌ను ఉద్దేశించి స్లెడ్జింగ్ చేయగా, ఆ తర్వాత కొద్దిసేపటికే వైభవ్ తన వికెట్ కోల్పోయాడు. మ్యాచ్ సమయంలో తిలక్ వర్మ.. "ఏంటి యార్ ఈ వైస్ కెప్టెన్" అంటూ వైభవ్‌ను రెచ్చగొట్టేలా మాట్లాడటం వినిపించింది. అయితే, ఈ సంఘటన తర్వాత ఇద్దరు ఆటగాళ్లు నవ్వుతూ కనిపించడంతో దీన్ని సీరియస్‌గా తీసుకోనట్లు అనిపించింది. కానీ, సోషల్ మీడియాలో మాత్రం అభిమానులు తిలక్ తీరును తప్పుబడుతున్నారు. 15 ఏళ్ల కుర్రాడిపై స్లెడ్జింగ్ వ్యూహం అవలంబించడం సరికాదని పలువురు విమర్శలు గుప్పించారు. ఈ స్లెడ్జింగ్ తర్వాత చామ మిలింద్ బౌలింగ్‌లో వైభవ్ ఔటయ్యాడు. అంతకుముందు వైభవ్ తన ఇన్నింగ్స్‌ను ఎంతో దూకుడుగా ప్రారంభించాడు. భారత సీనియర్ పేసర్ మహమ్మద్ సిరాజ్ బౌలింగ్‌లోనూ అద్భుతమైన షాట్లు ఆడాడు. మొత్తం మీద 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 44 పరుగులు సాధించాడు. వైభవ్ దూకుడైన ఆటతీరు మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్‌పైనా ప్రభావం చూపినట్లు కనిపించింది. ఈశ్వరన్ కూడా దూకుడుగా ఆడి 86 బంతుల్లో 10 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 72 పరుగులు చేసి రనౌట్‌గా వెనుదిరిగాడు. వీరిద్దరి భాగస్వామ్యంతో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో శుభారంభం చేసింది.

# సాత్విక్-చిరాగ్ సంచలనం.. చైనా మాస్టర్స్ టైటిల్ సొంతం

- చైనా మాస్టర్స్ సూపర్ 750 టైటిల్‌ను గెలుచుకున్న సాత్విక్-చిరాగ్
- ఫైనల్‌లో చైనా జోడీపై హోరాహోరీ పోరులో విజయం
- తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకున్న భారత ద్వయం
- ఈ సీజన్‌లో సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్
- గాయాలతో బాధపడుతున్నా అద్భుత ప్రదర్శన కనబర్చిన భారత జోడీ




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి సంచలనం సృష్టించారు. ప్రతిష్ఠాత్మక చైనా మాస్టర్స్ సూపర్ 750 పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. షెన్‌జెన్‌లోని అరీనాలో ఆదివారం జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో చైనా జోడీ హీ జి టింగ్, రెన్ జియాంగ్ యూపై 11-21, 21-13, 21-17 తేడాతో అద్భుత విజయం సాధించారు. గంటా 10 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించింది. తొలి గేమ్‌లో చైనా జోడీ తమ వేగం, తెలివైన షాట్లతో పూర్తి ఆధిపత్యం చెలాయించింది. దీంతో సాత్విక్-చిరాగ్ 11-21 తేడాతో సులభంగా గేమ్‌ను కోల్పోయారు. అయితే, రెండో గేమ్‌లో భారత ద్వయం అద్భుతంగా పుంజుకుంది. తమ అనుభవాన్ని రంగరించి, ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచి 21-13తో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లారు. నిర్ణయాత్మక మూడో గేమ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. తొలుత చైనా జోడీ 4-0 ఆధిక్యంతో దూకుడుగా ప్రారంభించినా, సాత్విక్-చిరాగ్ ఏ దశలోనూ పట్టు వదల్లేదు. స్కోరు 17-17తో సమమైన కీలక దశలో భారత ద్వయం వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 21-17తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ సీజన్‌లో సింగపూర్ ఓపెన్ తర్వాత సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్ కావడం విశేషం. ఇటీవలి టోర్నీలలో నిరాశపరిచినప్పటికీ, ఈ విజయంతో వారు తిరిగి ఫామ్‌లోకి వచ్చారు. భుజం నొప్పితో సాత్విక్, వెన్ను నొప్పితో చిరాగ్ బాధపడుతున్నా... గాయాలను లెక్కచేయకుండా వారు ప్రదర్శించిన పోరాట పటిమ అభిమానులను ఆకట్టుకుంది.

# నా రిటైర్మెంట్ ఎప్పుడో నాకే తెలుసు.. రోహిత్‌పై ఆగని రూమర్లు: బీసీసీఐ మీటింగ్‌లో అసలేం జరిగింది?







**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్‌లో ఒక ఆటగాడు తోటి ప్లేయర్లతో కలిసి బాల్కనీలో కూర్చున్నా, లేదా కుటుంబ సభ్యులు ఐపీఎల్ మ్యాచ్‌కు వచ్చినా.. ఆఖరికి ఏదైనా రియాలిటీ షోలో కనిపించినా దానిని రిటైర్మెంట్ సంకేతంగా భావించడం పరిపాటిగా మారింది. రోహిత్ శర్మ విషయంలోనూ ప్రస్తుతం అదే జరుగుతోంది. శుభ్‌మన్ గిల్ వన్డే కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రోహిత్ భవిష్యత్తుపై రకరకాల పుకార్లు షికారు చేస్తున్నాయి. కానీ ఇంగ్లాండ్ పర్యటనలో లార్డ్స్ మైదానంలో ప్రదర్శతో హిట్ మ్యాన్ అద్భుత ఫామ్‌లో కొనసాగుతున్నాడు. బయట వస్తున్న విమర్శలపై స్పందిస్తూ శబ్దాలు (నాయిస్) లేకపోతే అందులో మజా ఉండదని రోహిత్ ఆ వార్తలని కొట్టిపారేశాడు.

**బీసీసీఐ రివ్యూ మీటింగ్ సంచలనం.. సెలెక్టర్ల ఒత్తిడి నిజమేనా?:**
రోహిత్ శర్మ రిటైర్మెంట్‌పై ఇటీవల ముంబైలో జరిగిన బీసీసీఐ రివ్యూ మీటింగ్‌లో చర్చ జరిగినట్లు వార్తలు రావడం వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. బోర్డులోని ఒక సెలెక్టర్ రోహిత్‌ను రిటైర్ అవ్వాలని కోరినట్లు, దానికి హిట్ మ్యాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు, ఆ తర్వాత పెద్దల జోక్యంతో సర్దుమనిగిందంటూ రకరకాల వర్షన్లు ప్రచారంలోకి వచ్చాయి. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఈ మీటింగ్‌కు హాజరుకాకపోవడంపై కూడా అనేక అంచనాలు వెలువడ్డాయి. కానీ బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందిస్తూ అసత్య ప్రచారాలను నమ్మవద్దని, ఆధారాలు లేని వార్తలను వ్యాప్తి చేయవద్దని స్పష్టం చేశారు.

**వడాపావ్ మానేసి పక్కా ఫిట్‌నెస్.. కంబ్యాక్ కోసం తీవ్ర శ్రమ:**
11,000 పైగా వన్డే పరుగులు, మూడు డబుల్ సెంచరీలు, ఛాంపియన్స్ ట్రోఫీ, టీ20 వరల్డ్ కప్ వంటి చారిత్రాత్మక విజయాలను భారత్‌కు అందించిన రోహిత్ శర్మ, తన రిటైర్మెంట్ నిర్ణయం ఎప్పుడు తీసుకోవాలో నిర్ణయించుకునే హక్కును సంపాదించుకున్నాడు. రిటైర్ అవ్వడానికి తాను ఇంకా రెడీగా లేనని అతని చర్యలే నిరూపిస్తున్నాయి. రోహిత్ తనకు ఎంతో ఇష్టమైన వడాపావ్‌ను కూడా త్యాగం చేసి, బరువు తగ్గి మైదానంలో మరింత వేగంగా కదిలేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాడు. డొమెస్టిక్ క్రికెట్ ఆడేందుకు సైతం ఆసక్తి చూపిస్తూ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే కసి తనలో ఇంకా ఉందన్నాడు.

**జైస్వాల్ సిద్ధమే.. రోహిత్‌ను బలవంతంగా తప్పించాలా?:**
భారత క్రికెట్ భవిష్యత్తు కోసం యశస్వి జైస్వాల్ వంటి యువ కిరణాలు సిద్ధంగా ఉన్న మాట వాస్తవమే, సెలెక్టర్లు కూడా 2027 వన్డే ప్రపంచకప్ దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రచించడంలో తప్పులేదు. కానీ ఉత్తమ ఫామ్, ఫిట్‌నెస్‌తో ఉన్న రోహిత్ శర్మను బలవంతంగా బయటకు పంపడం సరైన పద్ధతి కాదని క్రీడా పండితులు పేర్కొంటున్నారు. జైస్వాల్‌ను జట్టుతో పాటు ప్రయాణింపజేస్తూ, తగినన్ని లిస్ట్-ఎ మ్యాచ్‌లు ఆడిస్తూ వారసుడిగా తీర్చిదిద్దడం సెలెక్టర్ల బాధ్యత. అంతే తప్ప ప్రతి మ్యాచ్‌నూ రోహిత్ కు రిటైర్మెంట్ పరీక్షగా మార్చడం సరికాదు. ఆటగాడిగా తాను వైదొలగాలని భావించిన రోజు హిట్ మ్యాన్ స్వయంగా ఆ నిర్ణయాన్ని ప్రకటించనున్నాడు.




# 2026లో అదిరిపోయే కంబ్యాక్ ఇచ్చిన సౌత్, నార్త్ హీరోలు!









చిత్ర పరిశ్రమలో గెలుపోటములు సహజం. వరుస పరాజయాలు ఎదురైనప్పుడు ఆ హీరో పనైపోయిందని విమర్శ కులు పెదవి విరిచిన వేళ తమ అసలైన స్టామినాతో తిరిగి పుంజుకోవడమే నిజమైన స్టార్‌డమ్. 2026 నాటి చరిత్రను పరిశీలిస్తే సౌత్ నుంచి నార్త్ వరకు పలువురు అగ్ర కథానాయకులు వరుస ఫ్లాపుల నుంచి తేరుకుని ఊహించని రీతిలో బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లతో ఖతర్నాక్ కంబ్యాక్ ఇచ్చారు. మాస్ మహారాజా రవితేజకు ఇటీవల ఎదురైన కొన్ని పరాజయాల తర్వాత ఆయన మార్కెట్ తగ్గిందనే విమర్శలు వినిపించాయి. అయితే ఆ విమర్శలన్నింటికీ చెక్ పెడుతూ ఆయన నటించిన -ఇరుముడి- చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 200 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లకు ఏకంగా 100 కోట్ల నికర లాభాలను తెచ్చిపెట్టి రవితేజ మాస్ పవర్‌ను మరోసారి నిరూపించింది. కోలీవుడ్ వర్సటైల్ నటుడు సూర్య సైతం కొన్ని ఫ్లాపుల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కానీ 2026 ఆయన కెరీర్‌లోనే గోల్డెన్ ఇయర్‌గా నిలిచింది. సూర్య నటించిన -కరుప్పు- బాక్సాఫీస్ వద్ద 300 కోట్ల అసాధారణ వసూళ్లను పాధించింది. ఆ వె వెంటనే రిలీజ్ అయిన -విశ్వనాథ్ అండ్ సన్స్- 240 కోట్ల భారీ వసూళ్లను సాధించింది. ఇలా ఒకే ఏడాదిలో రెండు భారీ హిట్ల ద్వారా సూర్య పవర్ఫుల్ కంబ్యాక్ ఇచ్చారు. మాలీవుడ్ లో -ప్రేమమ్- చిత్రంతో సంచలనం సృష్టించిన నివిన్ పౌలీ ఆ తర్వాత సరైన విజయం లేక వెనుకబడ్డారు. అయితే ఆయన కథానాయకుడిగా వచ్చిన -బెత్లహం కుటుంబ యూనిట్- చిత్రం మాలీవుడ్ బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఇటీవల రిలీజ్ అయిన ఈ సినిమా ఏకంగా 200 కోట్ల వసూళ్లతో నివిన్ పౌలీ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. బాలీవుడ్‌లో కూడా ఒకప్పటి మాస్ హీరో ఇమ్రాన్ హాష్మీ రీ-ఎంట్రీ సరికొత్త చరిత్రను తిరగరాసింది. సుదీర్ఘ విరామం తర్వాత ఆయన నటించిన -ఆవారాపన్ 2- చిత్రం థియేటర్లలో సరికొత్త ఊపును తీసుకొచ్చింది. తన మార్కు డైలాగ్ డెలివరీ, మ్యూజిక్, నటనతో ఇమ్రాన్ హాష్మీ బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద పవర్ఫుల్ మాస్ కంబ్యాక్‌ను నమోదు చేశారు. అలా నలుగురు హీరోలకు 2026 మరో మైలురాయిగా నిలిచిపోతుంది. సరైన కథ, పాత్ర పడితే ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని సాధించిన విజయాలు నిరూపించాయి. విమర్శించిన నోళ్లే ప్రశంసలు కురిపించాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com